RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily





Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263

ఆంధ్రప్రదేశ్:- 9885426263



పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ ఆదివారం 11-10- 2026 సంపుటి : 6 సంచిక : 240 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00


## పులి సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలి



2లో

- హనుమాన్ బృందాలను మోహరించి, పులిని త్వరగా సురక్షితంగా బంధించండి
- అటవీ శాఖ అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

## రాహుల్ గాంధీ కి మద్దతుగా సంగారెడ్డి లో జగ్గారెడ్డి 'సేవ్ అవర్ ఓట్స్' అనే వినూత్న కార్యక్రమం..

- జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంగారెడ్డిలో బ్యాలెట్ బాక్స్ ఉద్యమం
- ఓటర్ల పేర్లు, బూత్ నంబర్లు, సందేశాలతో బ్యాలెట్ బాక్స్‌లో వినతులు.. ఓటు హక్కు పరిరక్షణ పోరాటానికి సంఘీభావం
- ఓట్ చోరీకి పాల్పడుతున్న కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి




2లో

## రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రం

- తాగడానికి నీళ్లు, కొందామన్నా కరెంటు దొరకడం లేదు
- ఈ స్థితిలో యాసంగి పంటలు వేస్తే దారుణంగా ఉంటుంది
- కావాల్సినన్ని పనిదినాలు కల్పిస్తాం.. అదనపు రేషన్ ఇస్తాం
- రాష్ట్రంలోని రైతులకు విజ్ఞప్తి చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్
- మంత్రులతో భేటీ రోజు రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్
- 1500 మెగావాట్లు కామన్ పూల్ నుంచి ఇవ్వాలని కేంద్రానికి వినతి
- 60-40 నిష్పత్తిలో రైతులకు పరిహారం అందిద్దామంటూ ప్రతిపాదన
- ఖరీఫ్ పంటల రక్షణకు సంకల్పం.. గ్రామ, రాష్ట్ర కమిటీల ఏర్పాటు
- విద్యుత్తును, నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన
- సీఎం రేవంత్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయాలు



హైదరాబాద్, **అభ్యుదయం**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీనికి అవసరమైన కార్యాచరణను అమలు చేయడానికి సిద్ధమవుతోంది. ముఖ్యంగా, పంటలు, తాగునీరు, విద్యుత్తు వంటి కీలక సమస్యలపై దృష్టి సారించింది. ఈ గడ్డు కాలం నుంచి ఎలా గట్టెక్కాలన్న దానిపై సీరియస్‌గా ఆలోచిస్తోంది. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి శనివారం ఎల్‌నినో ప్రభావంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు ఇచ్చిన క్షేత్రస్థాయి నివేదికలను పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి ఓ నిర్ణయానికి వచ్చారు.ఎల్‌నినోతో రాష్ట్రంలో తీవ్రమైన సంక్షోభం నెలకొందని, ఈ దృష్ట్యా రబీ సీజన్‌లో ఎలాంటి పంటలు వేయవద్దని రైతులకు విజ్ఞప్తి చేయనున్నారు. నిజానికి, ఈనెల 12న ఎల్‌నినో ప్రభావంపై మంత్రులతో సీఎం

మిగతా 2లో

## నిరసనపై కేంద్రం నిర్బంధకాండ..
# 7వేల మంది అరెస్ట్

- నిరసనపై కేంద్రం నిర్బంధకాండ.. సీజేపీ ఆందోళనలపై ఉక్కుపాదం
- విమానంలోనే దీప్కే నిర్బంధం.. ఢిల్లీలో నలుగురు మాజీ సీఎంలు అదుపులోకి
- శత్రుదుర్భేద్య కోటగా జంతర్‌మంతర్.. దేశంలో సూపర్ ఎమర్జెన్సీ: విపక్షాల ఫైర్
- సీజేపీ ఆందోళనపై మోదీ సర్కార్ ఉక్కుపాదం
- దేశవ్యాప్తంగా 7 వేల మందికిపైగా అరెస్ట్



న్యూఢిల్లీ, **అభ్యుదయం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసనను కేంద్రం ఉక్కుపాదంతో అణచివేసింది. కనీవినీ ఎరుగని రీతిలో భద్రతా బలగాలను మోహరించి నిరసనకారులను ఎక్కడికక్కడ నిర్బంధించింది. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కే, నలుగురు మాజీ ముఖ్యమంత్రులు, యూట్యూబర్ ధ్రువ్ రాఠీతోసహా 7,000 మందికిపైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నది. నిరసనలకు కేటాయించిన జంతర్ మంతర్ ప్రాంతం శనివారం రోజంతా నిర్మానుష్యంగా కనిపించింది.నిరసనకారులను ఆ ప్రాంతానికి రాకుండా అడ్డుకునేందుకు రాజధానిలో 30,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని మోహరించడంతో పాటు వరుసగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఈ పరిస్థితిని అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ) కంటే దారుణమైనదిగా అభివర్ణించాయి. సీజేపీ పిలుపునిచ్చిన నిరసనలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తుండగా మాజీ ముఖ్యమంత్రులు అరవింద్ కేజ్రీవాల్(ఆప్), మమతా బెనర్జీ(టీఎంసీ), పినరయి విజయన్ (సీపీఎం), మాణిక్ సర్కార్(సీపీఎం)తోసహా పలువురు ప్రతిపక్ష నాయకులను రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇది అత్యవసర పరిస్థితిని

- మిగతా 2లో పేజిలో

## కేసీఆర్ వల్లే ప్రగతిపథంలో తెలంగాణ

- సిద్దిపేట ప్రజలు కేసీఆర్‌ను గెలిపించడం వల్లే తెలంగాణ.. జిల్లా సాకారం
- పదేండ్ల ప్రగతి పండుగ సిద్దిపేట ప్రజలకే అంకితం
- సిద్దిపేట దశాబ్ది ఉత్సవాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట, **అభ్యుదయం**

: 'నాడు సమైక్య పాలనలో తెలంగాణ ఉద్యమ జెండా ఎత్తిన కేసీఆర్‌ని నిలబెట్టి గెలిపించింది సిద్దిపేట గడ్డ.. ఆనాడు మీరు కేసీఆర్‌ని గెలిపించడం వల్లే తెలంగాణ వచ్చింది, స్వరాష్ట్రం సిద్ధించడం వల్లే జిల్లా ఏర్పాటై ఇంతటి అభివృద్ధి సాధ్యమైంది. ఈ అభివృద్ధి అంతా సిద్దిపేట మట్టి గొప్పతనం, ప్రజల గొప్పతనం.. అందుకే ఈ పదేండ్ల ప్రగతి పండుగను సిద్దిపేట ప్రజలకే సగర్వంగా అంకితం చేస్తున్నాను.

మిగతా 2లో

## ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో సాగుతున్న టెండర్ల వ్యవహారం

- 'గ్రీన్‌ఫీల్డ్' పనుల్లో మొదలైన అక్రమాలు
- సీఎం రమేశ్‌కు టెండర్ల యత్నాల అడ్డగింత
- 'బిడ్వేల్' టెండర్లకు అవినీతి మరకలు
- బాగోతాన్ని బట్టబయలు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



హైదరాబాద్ **అభ్యుదయం** ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో సాగుతున్న టెండర్ల వ్యవహారం.. ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల పనుల ముసుగులో నచ్చినోళ్లకు టెండర్లు కట్టబెట్టి వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసే ప్లాన్ అమలుచేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రతిపాదించిన 9 రోడ్లలో ఇప్పటివరకు రెండింటికి టెండర్లు ఖరారు చేయగా.. వాటిలోనూ ప్రభుత్వ పెద్దలు, అధికారులు కలిసి రూ.వేల కోట్లను పంచుకున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బాంబు పేల్చడం చర్చకు దారితీసింది.మొదట ఈ భారీ ప్రాజెక్టును సీఎం రమేశ్‌కు చెందిన కంపెనీకి కట్టబెట్టాలని అధికార వర్గాలు విశ్వప్రయత్నాలు చేసినా ఎల్అండ్‌టీ అడ్డుతగలడంతో రెండో ప్యాకేజీని

మిగతా 2లో

## బీసీ రిజర్వేషన్లపై వైసీపీ కుట్ర.. బట్టబయలు!



- బీసీలకు అన్యాయం చేసిన జగన్
- రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ సమాధానం చెప్పాలి
- బీసీలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

2లో

# పులి సంచారం నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలి

అమరావతి, తూర్పు గోదావరి జిల్లా చాగల్లు గ్రామ పరిసరాల్లో పులి సంచరిస్తున్న నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. గ్రామ సమీపంలోని పంట పొలాల మధ్య పులి ఉన్నట్టు గుర్తించిన నేపథ్యంలో గ్రామస్తులు అటవీశాఖ అధికారుల సూచనలకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పులి కదలికలు, దానిని సురక్షితంగా బంధించేందుకు చేపడుతున్న చర్యలపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పులి సంచారానికి సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు నిరంతరం చేరవేయాలని స్పష్టం చేశారు. ప్రజలు పొలాల వైపు ఒంటరిగా వెళ్లడం, పులిని నేరుగా చూడాలనే అత్యుత్సాహం ప్రదర్శించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని, అటవీశాఖ అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. పులి అటవీ ప్రాంతం వెలుపల సంచరిస్తున్నందున దానిని సురక్షితంగా బంధించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో హనుమాన్ బృందాలను మోహరించి, దాని కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ మొత్తం ఆపరేషన్‌ను అటవీశాఖ జోనల్ కన్జర్వేటర్ పర్యవేక్షణలో సమన్వయంతో నిర్వహించాలని స్పష్టం చేశారు.ఏ

# రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రం

సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. కానీ.. అదే రోజు ఏఐసీసీ ఢిల్లీలో నిరసన కార్యక్రమాన్ని చేపడుతోంది. దీనికి సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఎంపీలు, ఇతర కీలక నేతలంతా తరలి వెళ్లనున్నారు. ఫలితంగా, 12న నిర్వహించాల్సిన సమావేశం వాయిదా పడింది. అయినా, సీఎం రేవంత్ త్వరలోనే దానిని నిర్వహించనున్నారు. అదే రోజు 'పంటలు వేయొద్దు' అని రైతులకు సీఎం విజ్ఞప్తి చేయనున్నారు. ఆ రోజు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. '

'ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో తాగడానికి నీళ్లు దొరకడం లేదు. కొందామన్నా విద్యుత్తు దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పంటలు వేస్తే.. పరిస్థితులు మరీ దారుణంగా ఉండే ప్రమాదముంది. రబీ సీజన్‌లో పంటలకు నీరు అందకపోవచ్చు. రైతాంగం ఇప్పటికే ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొంటోంది. ఉన్న నీటిని కూడా పంటలకు వినియోగిస్తే తాగునీటికి చాలా సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుంది. మీరు పంటలు వేయకుండా ఉంటే.. ఉన్న నీటిని తాగునీటికి వినియోగిస్తాం. కావాల్సినన్ని రోజులు పని దినాలు కల్పిస్తాం. అదనపు రేషన్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ... మీరు మాత్రం పంటలు వేయొద్దు" అని సీఎం రేవంత్ వివరించనున్నారు.

**కేంద్ర సహాయం కోసం విజ్ఞప్తి**

మంత్రులతో సమావేశాన్ని నిర్వహించే రోజే.. సహాయం కోసం కేంద్రానికి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేయనున్నారు. రాష్ట్రంలో రబీ పంటలను రైతులు సాగు చేయడం లేదని, ఈ దృష్ట్యా అన్ని రకాలుగా ఆదుకోవాలని కేంద్రాన్ని కోరనున్నారు. ముఖ్యంగా.. రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్తు సమస్య నెలకొంటున్నందున కామన్ పూల్ కింద రాష్ట్రానికి 1500 మెగావాట్ల విద్యుత్తును అందించాలని డిమాండ్ చేయనున్నారు. రబీ సీజన్‌లో రైతులు పంటలు వేసే అవకాశం లేనందున.. ఆ నష్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలంటూ కేంద్రం దృష్టికి తీసుకెళ్లనున్నారు. పరిహారం కింద కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు భరించేలా చూద్దామంటూ విజ్ఞప్తి చేయనున్నారు. ఇందుకోసం అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకెళ్లే ఆలోచన ఉన్నట్లు సమాచారం.

**పంటల రక్షణకు గ్రామ కమిటీలు**

ప్రస్తుత ఖరీఫ్ పంటలను పరిరక్షించడానికి గ్రామ స్థాయిలో కమిటీలు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు సంఘాలు, స్వయం సహాయక మహిళా సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులతో ఈ కమిటీలను వేస్తారు. ఖరీఫ్ పంటలు మరో రెండు నెలల్లో చేతికి రానున్నాయి. ఇప్పుడు నీటి ఆవశ్యకత చాలా ఉంది. అందుకే, ఉన్న నీటిని పొదుపుగా ఎలా వాడుకోవాలన్న దానిపై ఈ కమిటీలు గ్రామాల్లో సూచనలు, సలహాలు ఇస్తాయి. అదే రకంగా రాష్ట్రంలో మంత్రులు, ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీ రబీ పంటలను వేయకుండా రైతులకు సూచనలు చేస్తుంది.

**తక్షణ చర్యలకు ప్రణాళికలు ఇవ్వండి: సీఎం**

ఎల్‌నినో ప్రభావంతో అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితులు తలెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో తక్షణ చర్యలకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉండటంతో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా తాగు, సాగు నీరు, వ్యవసాయం, విద్యుత్తు సమస్యల విషయంలో సరైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిందేనని స్పష్టం చేశారు.

"ఎల్‌నినో ప్రభావంతో రాబోయే సంక్షోభాన్ని ముందుగా గుర్తించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించాలి. రాబోయే 8 నెలలు కీలకం. ప్రతి కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేయాలి. రాబోయే రోజుల్లో విద్యుత్తు సమస్య తీవ్రతరమయ్యే ప్రమాదం ఉంది.

# కేసీఆర్ వల్లే ప్రగతిపథంలో తెలంగాణ

కేసీఆర్ ఆశీస్సులు.. ప్రజల దీవెనలతో ఈ స్థాయిలో ఉండి ప్రజలకు సేవ చేస్తున్నా. చరిత్ర ఉన్నంతవరకు సిద్దిపేటలో చేసిన అభివృద్ధి పనులు నిలబడి ఉంటాయి. దేశంలో ఎకడికి వెళ్లినా సిద్దిపేట వాళ్లమంటే గౌరవం దకేలా అభివృద్ధి చేశాను' అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేండ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం విపంచి కళానిలయంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో శాసనమండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, ఆయాచితం శ్రీధర్, జర్నలిస్టు నాయకుడు విరాహత్ అలీ, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితర నేతలతో కలిసి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిద్దిపేట సాహిత్య వైభవం, స్వరాష్ట్రంలో సాధించిన గుణాత్మక మార్పులు, భవిష్యత్తు ప్రణాళికలు వివరించారు.అనంతరం వర్తక, వాణిజ్య, వ్యాపార, వైశ్య సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో, రూబీ నెక్లెస్ రోడ్డు కోమటి చెరువు వద్ద ఫుడ్ ఫెస్టివల్‌తోపాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో సిద్దిపేట మీదుగా ఉత్తర భారతానికి రైళ్లు నడవనున్నాయని చెప్పారు. హైదరాబాద్ నుంచి సిద్దిపేట మీదుగా దక్షిణ భారతానికి ప్రతి అరగంటకు ఒక రైలు నడుస్తుందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేండ్ల కాలంలో రైస్ మిల్లులపై అధికారుల దాడులు జరుగలేదని గుర్తుచేశారు.

# ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు లీగల్ సెల్ రక్షణ కవచంలా నిలవాలి

అధ్యక్షులు, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైన దశలోకి వెళ్తున్నాయని, పార్టీ లీగల్ సెల్ ఇక సాధారణ అనుబంధ విభాగంగా కాకుండా ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని న్యాయపరంగా పర్యవేక్షించే వ్యవస్థగా పనిచేయాలన్నారు.రాష్ట్రంలో చట్టాలు, నిబంధనలు, ఎన్నికల వ్యవస్థలు ఉన్నప్పటికీ అవి సక్రమంగా అమలవడం లేదని ఆయన అన్నారు. 2024 ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు, దాడులు, వేధింపులు జరిగాయని, అలాంటి పరిస్థితుల్లో లీగల్ సెల్ కార్యకర్తలకు అండగా నిలిచిందని అభినందించారు.

**ఎస్ఐఆర్ పూర్తయ్యేలోపే ఎన్నికలకు ఎందుకు తొందర?**

ఎస్ఐఆర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో చనిపోయినవారి, డూప్లికేట్, అనర్హ ఓట్లు తొలగిస్తున్న పరిస్థితుల్లో, కొత్త ఓటర్ల జాబితా అందుబాటులోకి రాకముందే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు ప్రభుత్వం తొందరపడుతోందని సజ్జల అన్నారు. ఎస్ఐఆర్ ఫైనల్ జాబితా త్వరలోనే రావాల్సి ఉన్నప్పుడు, దానికి ముందే నోటిఫికేషన్ ఇవ్వాలనే ప్రయత్నం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారిని జాబితాలో చేర్చకుండా ఎన్నికలు నిర్వహిస్తే వారి రాజ్యాంగబద్ధ హక్కు దెబ్బతింటుందని అన్నారు.

**బీసీ రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి:**

బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ నివేదికను ప్రజలకు అందుబాటులో పెట్టకుండా శాతం నిర్ణయించడం ఏ ప్రాతిపదికన జరిగిందో వెల్లడించాలని సజ్జల డిమాండ్ చేశారు. కమిషన్ నివేదికను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు ఆధారాలు వెల్లడించాలని అన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై వైసీపీ కుట్ర.. బట్టబయలు!

అమరావతి,బీసీలకు రాజకీయ సాధికారత కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే, ఆ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించి, స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమయ్యేలా చేయాలన్నదే వైసీపీ కుట్రగా కనిపిస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. గతంలో బీసీలకు అమలులో ఉన్న 34 శాతం రాజకీయ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు బీసీలకు తిరిగి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబునే క్షమాపణ చెప్పాలని కోరడం విడ్డూరమన్నారు. బీసీల రిజర్వేషన్లను తగ్గించింది జగన్ ప్రభుత్వం కాదా? వారికి తిరిగి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు క్షమాపణ ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు.ప్రత్యేక కమిషన్ సిఫార్సుల ఆధారంగా చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించడంతోపాటు, బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మరోవైపు, ఎన్నికలు సకాలంలో జరగకపోతే స్థానిక సంస్థలకు అందాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధుల ప్రయోజనాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. వైసిపి కుట్రలో ఇది కూడా ఒక భాగం అన్నారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం, గ్రామాలు, పట్టణాలకు నిధులు అందడం ద్వారా అభివృద్ధి వేగవంతం కావడం వైసీపీకి ఇష్టం లేదా అని నిలదీశారు.స్థానిక సంస్థల్లో బీసీలకు గతంలో అమలులో ఉన్న 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి ఎందుకు తగ్గించారో జగన్ ప్రజలకు వివరించాలని మంత్రి సత్యకుమార్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పెద్దల కనుసన్నల్లో సాగుతున్న టెండర్ల వ్యవహారం

సర్దుబాటు చేసి వ్యవహారాన్ని చకబెట్టారని సమాచారం. మొదటి రోడ్డు అంశంలో అధికార పార్టీకి చుక్కలు చూపించేలా ఎల్‌అండ్‌టీ వ్యవహరించగా.. రేడియల్ రోడ్డు-2 విషయంలోనూ మూడు ప్యాకేజీలుగా విభజించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా బుద్వేల్ రోడ్డు టెండర్ల వ్యవహారం అదే బాటలో పయనిస్తూ అవినీతి మరకలను అంటించుకున్నది. స్వయంగా సొంత పార్టీ ఎమ్మెల్యేకు చెందిన సుశీ ఇన్‌ఫ్రా అనే కంపెనీ ఈ టెండర్ల అక్రమాలపై బహిరంగంగా గళం విప్పడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అధికార యంత్రాంగం నేతల కనుసన్నల్లో పనిచేసేందుకు సహకరిస్తున్నట్టు ఈ వ్యవహారంతో తేలింది.

# నిరసనపై కేంద్రం నిర్బంధకాండ..

మించిపోయింది.ఇది ఒక 'సూపర్ ఎమర్జెనీ'గా మారింది అని పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీనియర్ వామపక్ష నాయకురాలు బృందా కారత్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సామాజిక కార్యకర్త యోగేంద్ర యాదవ్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ఆల్ ఇండియా సూడెంట్స్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.చెన్నైలో జరిగిన ఛాతోన్‌కీ గూంజ్(విద్యార్థుల గళం) కార్యక్రమంలోపాల్గొన్న రాహుల్ గాంధీ పిరికితనమే ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్ఎస్ ప్రధాన లక్షణం అని వ్యాఖ్యానించారు. సీజేపీ నేతలు దీప్కే, సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వస్తున్న విమానంలో పోలీసులు అరెస్టు చేశారు. యూట్యూబర్ ధ్రువ్ రాఠీని గురుగ్రామ్‌లోని ఆయన ఇంట్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం రాత్రి మాజీ సీఎంలు సహా ఆందోళనకారులను పోలీసులు విడుదల



చేశారు. సీజేపీ నేతలను మాత్రం విడుదల చేయలేదు.

ఇందిరా గాంధీ కూడా ఇలా చేయలేదు!

దీప్కేతోపాటు ఇద్దరు నాయకులను ఒక మహిళా పోలీసు అధికారి విమానం లోపల అరెస్టు చేస్తున్న దృశ్యాలతో ఒక వీడియో బయటకు వచ్చింది. దేశం ఏ దిశగా వెళుతున్నదో మీరు చూడవచ్చు. మమ్మల్ని విమానం లోపలే నిర్బంధించారు. ఇందిరా గాంధీ కూడా ఎప్పుడూ ఇలా చేయలేదు. ఇది నియంతృ త్వం. కానీ వారికి మేము భయపడము అని దీప్కే పోలీసు అధికారితో అనడం వీడియోలో కనిపించింది.





పోలీసు అధికారులను ఉద్దేశిస్తూ రండి.. మమ్మల్ని అరెస్టు చేయండి. మేము అరెస్టు కావడానికే వచ్చాము. నాకు మీరంటే భయం లేదు. మేము అరెస్టు కావడానికి సిద్ధంగా ఉన్నా ము అని దీప్కే అన్నారు. ఇందుకు పోలీసు అధికారి స్పందిస్తూ ఇది అరెస్టు కాదు. దయచేసి సహకరించండి అని కోరడం కనిపించింది. విమా నం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ పోలీసు అధికారితో దీప్కే ఏ జైల్లో నన్ను ఉంచుతున్నారు. రాజస్థాన్‌లోని జైలుకా? ఎన్ఎస్ఏ లేదా యూఏపీఏ కేసులు నాపైన పెట్టుకోండి అని అనడం ఆ వీడియోలో వినిపించింది.

# రాహుల్ గాంధీ కి మద్దతుగా సంగారెడ్డి లో జగ్గారెడ్డి 'సేవ్ అవర్ ఓట్స్' అనే వినూత్న కార్యక్రమం

సంగారెడ్డి

ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంగారెడ్డిలో వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సేవ్ అవర్ ఓట్స్' పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన బ్యాలెట్ బాక్స్ ద్వారా ప్రజలు తమ సంఘీభావాన్ని తెలియజేసే కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో ప్రజలు తమ పేర్లు, పోలింగ్ బూత్ నంబర్లు రాసి, తమ ఓట్లను కాపాడాలని రాహుల్ గాంధీకి విజ్ఞప్తి చేస్తూ సందేశాలను బ్యాలెట్ బాక్స్‌లో వేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉన్నామని ఈ సందేశాల ద్వారా తెలియజేశారు.ఓటు హక్కు పరిరక్షణ అనేది కేవలం రాజకీయ నాయకులకు సంబంధించిన అంశం కాదని, ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన విషయమని ఈ కార్యక్రమం ద్వారా జగ్గారెడ్డి చాటిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రజల నుంచి నేరుగా సందేశాలను సేకరించడం ద్వారా ఓటు హక్కుల పరిరక్షణకు క్షేత్రస్థాయిలో మద్దతును కూడగట్టడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ "ఓటు హక్కు పౌరుడి గొంతుక. ఆ ఓటును కాపాడుకోవడం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించ ుకోవడంతో సమానం. సంగారెడ్డి ప్రజలు ఈ కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీకి బలమైన సందేశాన్ని పంపించారు. ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటంలో తామంతా భాగస్వాములమని చాటిచెప్పారు. ఇది ఒక్క నాయకుడి పోరాటం కాదు.. ప్రతి పౌరుడి ప్రజాస్వామ్య హక్కును కాపాడుకునేందుకు సాగుతున్న సమష్టి పోరాటం."ఈ వినూత్న కార్యక్రమం ద్వారా రాహుల్ గాంధీ ఓటు హక్కుల పరిరక్షణ పోరాటానికి ప్రజల మద్దతును తెలియజేయడంతో పాటు, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన అవసరాన్ని జగ్గారెడ్డి గుర్తు చేశారు.తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో 73 లక్షల ఓట్లను తొలగించారని, 92 లక్షల మంది ఓటర్లకు నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. ఓట్ల చోరీ కారణంగానే బీజేపీ ఎంపీలు గెలుస్తున్నారని, వారి మద్దతుతో మోడీ ప్రధాని అవుతున్నారని విమర్శించారు. ఇదే పద్ధతిలో నాలుగోసారి ప్రధాని అయ్యేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.మోడీ, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజల ఓట్లను చోరీ చేస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. కొన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు ఓట్లను దొంగిలించే కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశ పౌరుల హక్కులను, ముఖ్యంగా ఓటు హక్కును పరిరక్షించేందుకు రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు.జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపబోనని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీ తన కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వీధుల్లో ఆందోళనలు చేస్తున్నారని, ఓటు హక్కు పరిరక్షణ అంశంపై రాష్ట్రపతిని కలవనున్నారని చెప్పారు.

# ‘సర్’కు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ..

న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణప్రక్రియకు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయంటూ చేసే ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని వారు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఇండియా కూటమి నేతలు, కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపిస్తున్న వేళ మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేఖ రాయడం సంచలనంగా మారింది.

ఈ సందర్భంగా తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదని మాజీ అధికారులు లేఖలో పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత వంటి అంశాల్లో తమకు ప్రత్యక్ష అనుభవం ఉందని వివరించారు. గతంలో బూత్‌ల ఆక్రమణ, బ్యాలెట్ బాక్సుల చోరీ, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి అక్రమాలు జరిగేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణలో పలు భద్రతా చర్యలు అమలవుతున్నాయని మాజీ అధికారులు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారని వివరించారు. ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి, పర్యవేక్షణకు వీలుగా భద్రపరుస్తారని తెలిపారు. అలాగే, వీవీప్యాట్ స్లిప్పులను ఈవీఎంల లెక్కలతో సరిపోల్చే విధానం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక్క చోట కూడా రీపోలింగ్ అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళా ఓటర్లు రికార్డు స్థాయిలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో అమలవుతున్న పర్యవేక్షణ, భద్రతా చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు సంబంధించి కుట్ర జరిగినట్లు నిరూపించే ఆధారాలు



లేవని మాజీ అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాలపై ఆరోపణలు చేసేవారు అందుకు తగిన ఆధారాలను ప్రజల ముందుంచాలని కోరారు. కాగా, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు ప్రయత్నించిన పలువురు ప్రతిపక్ష నేతలను నేడు ఢిల్లీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. ఇలాంటి సమయంలో మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ చర్చనీయాంశమైంది.

## వారిని విడుదల చేయకపోతే మళ్లీ నిరాహారదీక్ష..

కేంద్రానికి వాంగ్‌చుక్ హెచ్చరిక



న్యూఢిల్లీలో పోలీసులు అదుపులోకి తీసుకున్న నాయకులను, నిరసనకారులను 24 గంటల్లో విడుదల చేయాలని, లేకపోతే తాను నిరాహారదీక్ష లేదా పాదయాత్ర చేపడతానని పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే ఈ నిరసనకు అనుమతి లేదన్న పోలీసులు.. ఇందులో పాల్గొన్న నాయకులు, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. ఇలా నిరసనకారులను అరెస్ట్ చేయడాన్ని వాంగ్‌చుక్ ఖండించారు. ఈ పరిస్థితి ప్రకటించని ఎమర్జెన్సీలాగా ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు పలువురు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ , కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి అరెస్ట్‌లను వాంగ్‌చుక్ తీవ్రంగా తప్పుబట్టారు. ‘నిరసనకు చాలా మంది రాజకీయ నాయకులు మద్దతు ఇవ్వటం నాకు ఆనందాన్ని ఇచ్చింది. అయితే ఈ నాయకులందరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఇప్పుడే తెలిసింది. వీరందరినీ ప్రభుత్వం రేపటిలోగా విడుదల చేయాలి. లేనిపక్షంలో నేను నిరాహారదీక్ష లేదా పాదయాత్ర చేస్తాను’ అని ఆయన పేర్కొన్నారు. కాగా గతంలో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేసిన సంగతి విదితమే.

## ముంబైలో ఉద్రిక్తత.. నటుడు ఇమ్రాన్ ఖాన్‌తో సహా 400 మందికి పైగా ఆందోళనకారుల అరెస్టు!



కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసనలకు మద్దతుగా ముంబైలో చేపట్టిన ఆందోళనలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. ముందస్తు అనుమతి లేకుండా నగరంలోని ఆగస్ట్ క్రాంతి మైదానం, ఇతర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో 400 మందికి పైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళనల్లో ప్రముఖ బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్ కూడా ఉన్నారు.నేషనల్ క్యాపిటల్‌లో జరుగుతున్న సీజేపీ ఆందోళనకు సంఘీభావంగా ముంబైలో ఈ నిరసనలు చేపట్టారు. శుక్రవారం రోజు ఉదయం సామాజిక కార్యకర్త తుషార్ గాంధీ నేతృత్వంలోని ‘హం భారత్ కే లోగ్’ సంస్థ సభ్యులు, సీపీఐ(ఎం) కార్యకర్తలు సహా దాదాపు 200 మందిని పోలీసులు ఇదే ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, ప్రకాశ్ అంబేడ్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అఘాడి (ఎదీూ) కార్యకర్తలు కూడా సీజేపీకి మద్దతుగా దక్షిణ ముంబైలోని హుతాత్మా చౌక్ వద్ద ఆందోళన చేశారు. అనుమతి లేకుండా నిరసనలు చేపట్టిన వారందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే ప్రక్రియ కొనసాగుతోందని పోలీసు అధికారులు వెల్లడించారు

## ఢిల్లీలో పరిస్థితి ఎమర్జెన్సీ కంటే దారుణంగా ఉంది

అరవింద్ కేజ్రీవాల్



‘ప్రధాని మోదీ సంపూర్ణ నియంతృత్వ పాలనలో మనం జీవిస్తున్నాం. ఎమర్జెన్సీలో కూడా ఇంత దారుణంగా లేదు. ఇది ఎమర్జెన్సీని మించినది. రైళ్లను, మెట్రోలను, రోడ్డు మార్గాలను నిలిపివేశారు. కాగా.. విమానంలో సీజేపీ నేతలు వస్తే.. విమానం దిగడంతోనే వారిని అరెస్ట్ చేయడం నిజంగా భయాన్ని కలిగిస్తోంది. మోదీ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా కాలరాస్తున్నారు. ప్రధాని మోదీకి తాను దొంగ ఓట్లతోనే ఎన్నికల్లో గెలిచానని స్పష్టంగా తెలుసు.. అందుకే ఈ ఉద్యమాన్ని అణచివేసి తన మోసం బయటపడకుండా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు’ అని కేజ్రీవాల్ తీవ్రంగా ఆరోపించారు.

## రాహుల్ గాంధీతో విజయ్ భేటీ

కేఫ్‌లో కాఫీ, తిరమిసు.. అభిమానులతో సెల్ఫీలు..



కాంగ్రెస్ అగ్రనేత నేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ తాజా భేటీ దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెన్నైలోని నీలాంకరైలో ఉన్న విజయ్ నివాసంలో సుమారు గంటపాటు ఇద్దరూ చర్చలు జరిపారు. అనంతరం సమీపంలోని ఓ కేఫ్‌కు వెళ్లి కాఫీ, తిరమిసు, కుకీలు ఆస్వాదించారు. రాజకీయ చర్చలతో ప్రారంభమైన ఈ భేటీ.. ఆత్మీయ పలకరింపులు, అభిమానులతో సెల్ఫీలతో ప్రత్యేకంగా నిలిచింది విద్యార్థులతో సమావేశంలో పాల్గొనేందుకు శనివారం చెన్నై చేరుకున్న రాహుల్ గాంధీ.. ముందుగా ముఖ్యమంత్రి విజయ్ నివాసానికి వెళ్లారు.

నీలాంకరైలోని తన ఇంటి వద్ద విజయ్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు నేతలు సుమారు గంటపాటు సమావేశమయ్యారు. ఈ భేటీలో వీరిద్దరూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్–టీవీకే మధ్య సమన్వయం, భవిష్యత్తు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇంటి వద్ద సమావేశం ముగిసిన తర్వాత రాహుల్ గాంధీ, విజయ్ సమీపంలోని ఓ కేఫ్‌కు వెళ్లారు కేఫ్‌లో ఈ ఇద్దరూ కాపుచినో, తిరమిసు, కుకీలు ఆర్డర్ చేసి ఆస్వాదించారు ఇద్దరు నేతలు ఒకేచోట కనిపించడంతో కేఫ్‌లో ఉన్నవారు ఆశ్చర్యానికి గురయ్యారు. కొందరు అభిమానులు వారితో సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించారు. రాహుల్ గాంధీ, విజయ్ కూడా అక్కడి వారితో ముచ్చటించారు. సెల్ఫీలు దిగారు. సాధారణ రాజకీయ సమావేశాలకు భిన్నంగా సాగిన ఈ కేఫ్ సందర్శన.. ఇద్దరు నేతల మధ్య సాన్నిహిత్యాన్ని చాటింది.

## ‘పెండింగ్‌లో రూ.4 వేల కోట్ల రైల్వే ప్రాజెక్ట్..



మీ నాన్న కార్మిక శాఖా మంత్రిగా ఉండి ఏం పీకుతున్నడని ఎంపీ గడ్డం వంశీకృష్ణను బీఆర్ఎస్ నాయకుడు గౌతం ప్రసాద్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గౌతం ప్రసాద్ మాట్లాడుతూ.. మీ నాన్న ఏం పీకి కట్టలు కడుతున్నడు.. మీ నాన్నతోని ఈ రాష్ట్రానికి ఏం ఉపయోగముందని ప్రశ్నించారు .ఇండస్ట్రీల పేర్లతో ఎగదోచుకున్న, దోచుకున్న డబ్బు కాపాడుకోవడం కోసం పూటకో పార్టీ మార్చుకుంటూ.. మీ రాజకీయ పబ్బాన్ని గడుపుకుంటూ ఈ రోజు తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారా.. మీరు.. ఇది మీరు చేస్తున్న రాజకీయం.. మీ సంపాదనను కాపాడుకునేందుకు, వేల కోట్ల రూపాయల భూమిని కాపాడుకోవడం కోసం పార్టీ మారి ప్రభుత్వం మారంగానే మళ్లీ కండువా మార్చుకుని ప్రజల ముందుకొచ్చే వ్యవహారం పెట్టుకున్న మీరు, మీ ముఖాలు పెట్టుకొని మా కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయా మీది.. వెంట్రుక కృష్ణ.. వంశీకృష్ణ నువ్వు మా కేటీఆర్ గురించి మాట్లాడే స్థాయా.. మా నాయకుడి గురించి మాట్లాడే స్థాయా నీది.. సిగ్గు లేదు..నీకు కొంచెమన్నా.. వెంట్రుకల గురించి మాట్లాడటానికి అంటూ వార్నింగ్ ఇచ్చారు.రూ.4,210 కోట్లు రూపాయల రైల్వే ప్రాజెక్ట్ ఈ రోజు పెండింగ్‌లో ఉంది. దాని పొడవు 137 కిలోమీటర్లు.. డబ్బులు మంజూరైనా క్షేత్రస్థాయిలో దాని పనులు మొదలు కాలేదు.. ఏం చేస్తున్నవ్.. ఏం పీకుతున్నవో సమాజానికి సమాధానం చెప్పు.. ఎంపీ వెంట్రుక వంశీకృష్ణ నిన్నడుగుతున్నం.. నీకు దమ్మంటే.. ధైర్యముంటే.. సత్తా ఉంటే ప్రజల ముందుకొచ్చి సమాధానం చెప్పు.. అని గౌతం ప్రసాద్ సవాల్ విసిరారు.

## అభిజిత్ దీప్కే బృందాన్ని అదుపులోకి తీసుకున్న మహిళా పోలీసులు..

వారినే ఎందుకు మోహరించారంటే?



న్యూఢిల్లీ: జంతర్‌మంతర్ వద్ద నిరసనల కోసం విమానంలో ముంబై నుంచి ఢిల్లీ చేరిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే, ఆయన బృందాన్ని మహిళా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే మగ పోలీసులకు బదులుగా మహిళా పోలీసులను మోహరించడం ఢిల్లీ పోలీసుల ప్లాన్‌గా తెలుస్తున్నది. ) శనివారం సీజేపీ నాయకులు అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా ప్రయాణించిన ఎయిర్ ఇండియా విమానం ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ కాగానే నాటకీయ పరిణామాలు జరిగాయి. అక్కడ మోహరించిన మహిళా పోలీస్ అధికారులు వెంటనే ఆ విమానంలోకి ప్రవేశించారు. అభిజీత్ దీప్కే, ఆయన బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని అజ్ఞాత ప్రాంతానికి తరలించారు.

కాగా, అభిజిత్ దీప్కే, ఆయన బృందాన్ని అదుపులోకి తీసుకోవడానికి మహిళా పోలీస్ అధికారులను పంపడం ఢిల్లీ పోలీసుల ప్లాన్‌లో భాగంగా జరిగిందా? అన్న చర్చకు దారి తీసింది. ఒకవేళ పురుష పోలీస్ అధికారులను రంగంలోకి దించితే ఘర్షణలకు దారితీయవచ్చని ఢిల్లీ పోలీసులు ముందుగానే ఊహించి ఉంటారని తెలుస్తున్నది. అలాగే విమానంలో నడిచే ప్రాంతం చాలా ఇరుకుగా ఉంటుంది. ప్రయాణికులు కదలడానికి చాలా తక్కువ స్థలం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఒక చిన్న తోపులాట కూడా త్వరగా పెద్ద ఘర్షణగా మారే అవకాశమున్నది.

మరోవైపు నీట్ పేపర్ లీక్ వివాదంపై సీజేపీ చేపట్టిన తొలి భారీ నిరసన సందర్భంగా జూలై 20న తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా హింసాత్మక సంఘటనలు జరిగాయి. పురుష పోలీస్ అధికారులు యువతులను కొట్టడంతో పాటు వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సీజేపీ ఆరోపించింది. ఆ పోలీస్ అధికారులపై కేసుల నమోదుతో పాటు వారిపై చర్యలకు డిమాండ్ చేసింది.

ఈ నేపథ్యంలో ఈసారి ఢిల్లీ పోలీసులు చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తున్నది. అందుకే సీజేపీ నాయకత్వ బృందం అరెస్ట్ కోసం మహిళా పోలీసులకు ప్రాధాన్యత ఇచ్చారు. విమానంలో ఉద్రిక్తతలు పెరిగే ప్రమాదాన్ని నివారించే ఉద్దేశంతోనే ఢిల్లీ పోలీసులు మహిళా అధికారులను రంగంలోకి దించారు.

దీంతో చిన్న వాగ్వాదాలు మినహా ఎలాంటి ప్రతిఘటనలు ఎదురుకాలేదు. ఎలాంటి గందరగోళం లేకుండానే అభిజిత్ దీప్కే, ఇతర సీజేపీ నాయకులను మహిళా పోలీస్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఢిల్లీ పోలీసుల ముందస్తు ప్రణాళికలో లేని ఈ అనూహ్య చర్య, వ్యూహం ఉద్దేశపూర్వకంగా తీసుకున్నదా? లేదా అన్నది తెలియలేదు

# ఏంగిరిపూలుఅమావాస్యతో బితకమ్మ ప్రారంభం.





గోవిందరావుపేట, అక్టోబర్10 తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ ప్రారంభ మయ్యే మొదటి రోజును "ఎంగిలి పూల అమావాస్య" ఏంగిరిపూల అమావాస్య) అని పిలుస్తారు. ఆశ్వయుజ మాస మహాలయ అమావాస్య (పితృ అమావాస్య) రోజున ఈ వేడుక మొదలవుతుంది.

ఈ రోజు విశిష్టత మరియు ఆచారాలు క్రింది విధంగా ఉన్నాయి:

1. "ఎంగిలి పూల" అనే పేరు వెనుక కారణం

ఈ పేరు రావడం వెనుక రెండు ప్రధాన కారణాలు ప్రాచుర్యంలో ఉన్నాయి:

ముందే పూలనుకోసి ఉంచడం బతుకమ్మను పేర్చడానికి కావాల్సిన తంగేడు, గునుగు, చామంతి, బంతి వంటి రకరకాల పూలను పండుగకు ఒక రోజు ముందే (అనగా చతుర్దశి నాడే) చెట్ల నుండి కోసుకువస్తారు. ఆ పూలను రాత్రంతా ఇంట్లో ఉంచి, మరుసటి రోజు అమావాస్య నాడు బతుకమ్మగా పేరుస్తారు. ఒక రోజు నిల్వ ఉన్న పూలు కాబట్టి వీటిని 'ఎంగిలి పూలు' అని అంటారు. పితృదేవతల తర్పణం. మహాలయ అమావాస్య రోజున ఉదయాన్నే ఇంట్లోని పెద్దలు తమ పూర్వీకులకు (పితృదేవతలకు) పిండ ప్రదానాలు, తర్పణాలు ఇస్తారు. ఆ తర్వాతే ఇంట్లో అందరూ భోజనం చేసి, సాయంత్రం బతుకమ్మను తయారు చేస్తారు. పితృకార్యాలు ముగిసిన తర్వాత చేసే ప్రక్రియ కావడం వల్ల కూడా దీనికిఏం గిలి పూల బతకమ్మఅని పిలస్తారు,

## డాక్టర్ నవీన్ కుమార్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి**

**సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్**



గణపురం, అక్టోబర్ 10 (నారద): జగిత్యాల వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కోడూరి నవీన్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని గణపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. శనివారం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర అవసరమైన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఆత్మవిశ్వాసంతో సన్నద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడం ద్వారా వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని పేర్కొన్నారు. డాక్టర్ కోడూరి నవీన్ కుమార్ తన జన్మదిన వేడుకలను ఆడంబరాలకు దూరంగా సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు భరత్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు దూలం కుమారస్వామి గౌడ్, సీనియర్ జర్నలిస్టు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అవుట్ సోర్సింగ్ వీధుల్లో గుండెపోటుతో మృతి..




నిజామాబాద్ అక్టోబర్ 10 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుడు గుండెపోటుతో మృతి చెందాడు. ఔట్సో ర్సింగ్ లో పనిచేస్తున్న భూమయ్య 57 డివిజన్లో టాటా ఏస్ లీడర్ గా పనిచేస్తున్న ఆయనకు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో పడిపోయాడు. వెంటనే స్పందించిన సానిటరీ ఇన్స్పెక్టర్ జీవన్,సిబ్బంది ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు ఫిట్స్ వచ్చిన తర్వాత అతనికి గుండెపోటు రావడంతో మృతి చెందాడని తెలిపారు.

# పోడుభూముల్లో ఫారెస్ట్ అధికారులు జెసిబి తో కందకాలు.

**అడ్డు కున్నఆదివాసి గిరిజనులు వెనుతిరిగిన అధికారులు – భూములు పోతే బ్రతికేదెలా**




గోవిందరావుపేట, అక్టోబర్10( మండల పరిధి మచ్చాపూర్ శివారు గొత్తి కోయ ఆదివాసి గూడెంలో శుక్ర శనివారాల్లో పస్రా అటవీశాఖ అధికారులు సాగు చేసుకుంటున్నా పోడు భూముల్లో జెసిబి తో కందకాలు తీస్తుండగా అడ్డుకున్న ఆదివాసి గిరిజనులు వెను తిరిగిన అధికారులు సాగు భూమి లేకపోతే అనగా ఎలా బతకాలని గొత్తి కోయలు ఆందోళన చెందుతున్నారు , ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో పసర ఫారెస్ట్ అధికారులు జెసిబి సహాయంతో కంద కాలు తీసే కార్యక్రమం మొదలుపెట్టారని అన్నారు,ఇది తెలుసుకున్న ఆదివాసి లు తమ భూములలో కంతకాలు తీయవద్దని వేడుకున్నారు. అయినా ఫారెస్ట్ అధికారులు వినకుండా మీరుసాగుచేస్తున్న 30 ఎకరాల భూమి మాకు అప్పగించాలని డిమాండ్ చేశారని వారు తెలిపారు, రెండు రోజులుగా జెసిబి ని ఫారెస్ట్ అధికారులు గిరిజనుల సాగు భూముల వద్దకు తీసుకొచ్చి పనిచేయడం కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు, భూములు ఇవ్వకపోతే బలవంతంగా భూములు తీసుకోవాల్సి వస్తుందని ఆదివాసి గిరిజనులకు ఫారెస్ట్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన భూమిని గుంజుకుంటే మా భవిష్యత్తు ఏమిటని బ్రతుకులు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు, పోడుభూముల జోలికొస్తే ఊరుకోమని ఆదివాసి గిరిజనులు హెచ్చరించారు, గొత్తి కోయలు జెసిబికి అడ్డుగా కూర్చుని నిరసన తెలిపారు.. ఫారెస్ట్ అధికారుల ఆగడాలు ఆపాలని గత అనేక సంవత్సరాలుగా సాగు చేసుకునే జీవిస్తున్న వారి పట్ల ఇలాంటి విధానాలు అవలంబించడం చట్ట వ్యతిరేకమని అన్నారు.

దీంతో ఆగ్రహించిన ఆదివాసి గిరిజనులు తమ జీవనాధారమైన భూమిని గుంజుకోవడం ఆపాలని జెసిబికి అడ్డు తిరిగారు. మా భూములు గుంజుకుంటే ఊరుకోమని హెచ్చరించారు. గత 20 సంవత్సరాలుగా ఈ భూముల్లో మొక్కజొన్న పెసర కరేద అలుక్కొని వచ్చే పంటతో జీవిస్తున్నామని ఈ భూములు పోతే బతుకు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వెంటనే గూడెంలోని ప్రజలందరూ ఐక్యమై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఆందోళన తప్పదని హెచ్చరించారు

రోజురోజుకు పెరుగుతున్న ఫారెస్ట్ అధికారుల దాడులు.

ఫారెస్ట్ అధికారులు చాప కింద నీరు లాగా గిరిజన భూములను లాక్కోవడం కోసం ప్రయత్నిస్తున్నారని ఎదురు తిరిగిన వారినీ భయభ్రాంతులకు గురి చేస్తూ ఫారెస్ట్ ఆఫీసుకు తీసుకువచ్చి నానా బూతులు తిడుతూ వారిపై దౌర్జన్యం చేస్తూ భౌతిక దాడులకు పాల్పడినట్లు తెలుస్తుంది. . మాట వినకపోతే కేసులు నమోదు చేస్తామని జైలుకు పంపిస్తామని హెచ్చరించినట్లు గిరిజనులలో చర్చ కొనసాగుతుంది. మరి కొంతమంది ఫారెస్ట్ అధికారులు గిరిజన గూడెంలో జొరబడి వారి దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తూ వారి దగ్గర ఉన్న మేకలు ఇతర అటవీ ఉత్పత్తులను ఎత్తుకుపోతున్నట్లు తెలుస్తుంది.ఇది అన్యాయమని ప్రశ్నించిన నోరులేని ఆదివాసి మూగజీవాలను హింసించడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. గతంలో జనగలంచ,మట్నండాల్ తోగు,దేవుని గుట్ట, బయక్కపేట, ప్రాజెక్ట్ నగర్, తదితర గ్రామాల్లో గిరిజనులపై విపరీతమైన దాడులు చేసి ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు విధితమే.

ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్ రెడ్డి గిరిజన గ్రామాల్లో పర్యటన. ..

అండగా నిలుస్తామని ఆరోజు హామీ. .

ప్రభుత్వం మారినా మారని అటవీశాఖ అధికారుల తీరు. .

జనగాలంచ ఆదివాసి గిరిజన గ్రామంలో పారెస్టు అధికారులు ఆదివాసి గిరిజనులను చెట్టుకు కట్టేసి కొట్టిన ఘటనపై ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ప్రతిపక్ష నాయకుడిగా పర్యటించారు.ఆదివాసి గిరిజనులపై దాడులను తీవ్రంగా ఖండించారు.ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాశంగా మారింది. మేము అధికారంలోకి వస్తే గిరిజనులపై దాడులు జరగవని గిరిజనుల భూములకు రక్షణ కల్పిస్తామని ఆరోజు హామీ ఇచ్చారు.కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫారెస్ట్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి.

మంత్రి సీతక్క ఇలాకాలో గిరిజనుల భూములపై దాడులు. ..

మంత్రి సీతక్క నియోజకవర్గంలో ఆదివాసీ గిరిజన భూములపై ఫారెస్ట్ అధికారులు జెసిబిల సహాయంతో దాడులు చేయడం వారి భూముల్లో కంతకాలు తీయడం పట్ల గిరిజనుల్లో చర్చ కొనసాగుతుంది. ప్రతి గిరిజన గ్రామం నుండి 20 నుంచి 30 ఎకరాల భూమి గుంజుకొని ఫారెస్ట్ అధికారులు మొక్కలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కాలువ పెల్లి,ప్రాజెక్టు నగర్,దేవుని గుట్ట తదితర గ్రామాల్లో ఫారెస్ట్ అధికారులు జెసిబి లు తీసుకువచ్చి మొక్కలు పెట్టే కార్యక్రమం మొదలుపెట్టారు. ఈ ఘటనను ఆదివాసి గిరిజనులు తీవ్రంగా ప్రతిఘటించారు. జెసిబి లకు అడ్డంగా కూర్చున్నారు. మా భూముల జోలికొస్తే ఊరుకోమని హెచ్చరించారు. మా జీవనాధారమే ఆ భూమి అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం పట్ల మంత్రి సీతక్క హెచ్చరించిన ఫారెస్ట్ అధికారుల ఆగడాలు తగ్గలేదు.గత ప్రభుత్వం మారి నూతన ప్రభుత్వం వస్తే బతుకులు మారుతాయి అనుకున్న ఆదివాసి గిరిజనుల పట్ల ఫారెస్ట్ అధికారుల దాడులు యధావిధిగా కొనసాగుతున్నాయని పలువురు గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నీ దాడులు వెంటనే నిలిపివేసి గిరిజన పోడు రైతులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# దొంగలున్నారు జాగ్రత్త.. అప్రమత్తంగా ఉండండి!

**దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ఊళ్లకు వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

**దొంగతనాల నివారణకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా**

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**




భూపాలపల్లి క్రైమ్, అక్టోబర్ 10

దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లేవారు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. పండుగ సందర్భంగా పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రయాణాలు చేసే అవకాశం ఉన్నందున ఖాళీ ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దసరా సెలవులను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా పోలీస్ గస్తీని మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణ కాలనీలు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలు, ఒంటరిగా ఉన్న ఇళ్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రి వేళల్లో మొబైల్ పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయడంతో పాటు బీట్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు వివరించారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు జాగ్రత్త!

పండుగ సెలవుల్లో ఊళ్లకు వెళ్లేవారు తమ ఇళ్లకు నాణ్యమైన, బలమైన తాళాలు వేసుకోవాలని ఎస్పీ సూచించారు. నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను ఇళ్లలో ఉంచకుండా సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని తెలిపారు. ప్రయాణానికి వెళ్లే ముందు నమ్మకమైన పొరుగువారికి సమాచారం అందించాలని, అవసరమైతే స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూడా తెలియజేయాలని సూచించారు.

సామాజిక మాధ్యమాల్లో ప్రయాణ వివరాలు పెట్టొద్దు

ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్తున్న విషయాన్ని ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని ఎస్పీ హెచ్చరించారు. ఇలాంటి సమాచారం దొంగలకు అవకాశంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు.

చోరీల నివారణకు ప్రత్యేక పోలీస్ గస్తీ

దసరా సెలవుల్లో ఇళ్ల దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, ద్విచక్ర వాహనాల చోరీలు వంటి నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. గతంలో చోరీలు జరిగిన ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలీస్ నిఘాను పెంచినట్లు వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు, అపరిచితుల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయ నంబర్ 112కు సమాచారం అందించాలని కోరారు.

# నిరుద్యోగ యువత డిజిటల్ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

**పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు డిజిటల్ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరం**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**భూపాలపల్లి జిల్లా గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం**



భూపాలపల్లి, అక్టోబర్ 9 :ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకు లకు డిజిటల్ లైబ్రరీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించిన మంత్రి పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులతో మాట్లాడి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సాధారణ గ్రంథాలయాల్లో అందుబాటులో లేని పుస్తకాలను సైతం డిజిటల్ లైబ్రరీ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా చదువుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాణ్యమైన అధ్యయన సామగ్రిని డిజిటల్ రూపంలో పొందవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు డిజిటల్ గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని యువతకు పిలుపునిచ్చారు.

10 కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు

భూపాలపల్లి జిల్లా గ్రంథాలయంలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుని 10 కంప్యూటర్లు, అవసరమైన ఫర్నిచర్ సమకూర్చిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. నిరుద్యోగ యువతకు ఆధునిక సాంకేతిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పుస్తకాలు, అధ్యయన వనరులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలను వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. యువత డిజిటల్ లైబ్రరీలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, లైబ్రేరియన్ శారదతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి..
# మనూరు మండలంలో తీవ్ర విషాదం

**బట్టలు ఉతకడానికి వెళ్లి కుంటలో మునిగి అన్నదమ్ములు, మహిళ మృతి**

**కళ్లముందే జరిగిన ప్రమాదాన్ని గ్రామస్తులకు తెలిపిన కుమారుడు**





మనూరు / సంగారెడ్డి, అక్టోబర్ 8 :సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. బట్టలు ఉతకడానికి వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రమాదవశాత్తు కుంటలో మునిగి మృతి చెందారు. ఈ ఘటన మనూరు గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు, ఒక మహిళ ఉండటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.వివరాల్లోకి వెళ్తే.. మనూరు గ్రామ శివారులోని కుంట వద్దకు బట్టలు ఉతకడానికి నరసింహారెడ్డి (45), ఆయన సోదరుడు సంగమేశ్వర్ రెడ్డి (42), నరసింహారెడ్డి భార్య కృష్ణవేణి (38) వెళ్లారు. ఈ క్రమంలో ముగ్గురూ ప్రమాదవశాత్తు లోతైన నీటిలోకి జారిపడ్డారు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయి నట్లు సమాచారం.వారితో పాటు వెళ్లిన నరసింహారెడ్డి కుమారుడు హర్షవర్ధన్ తన కళ్లముందే జరిగిన ప్రమాదాన్ని చూసి భయాందోళనకు గురయ్యాడు. వెంటనే గ్రామంలోకి పరుగులు తీసి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. దీంతో గ్రామస్తులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.గాలింపు చర్యల్లో నరసింహారెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి మృతదేహాలను కుంటలో నుంచి వెలికితీశారు. తీవ్ర అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణవేణిని వెంటనే చికిత్స నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందింది.ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. కళ్లముందే తల్లిదండ్రులు, బాబాయిని కోల్పోయిన హర్షవర్ధన్ పరిస్థితి స్థానికులను కలచివేసింది. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొందిసమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి [illegible] ఘటనపై కేసు [illegible] సమాచారం. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

# లక్షణాలు వచ్చేదాకా ఆగొద్దు!

## క్యాన్సర్‌పై ముందస్తు అప్రమత్తతే ప్రాణరక్షణ




మంచిర్యాల, అక్టోబర్ 09,క్యాన్సర్ లక్షణాలు బయటపడే వరకు వేచి చూడకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయాన్ని నివారించవచ్చని సికింద్రాబాద్ యశోద ఆసుపత్రి సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ కిరణ్ మచ్చ సూచించారు. వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్తిన్ హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం లో క్యాన్సర్ నివారణ, నిర్ధారణ, ఆధునిక చికిత్సా విధానాలపై ఆయన వివరించారు. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యక రమైన ఆహారం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా పొగాకు, గుట్కా వినియోగం నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాల్లో ఒకటని చెప్పారు. దీర్ఘకాలంగా పొగతాగే వారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదం అధికంగా ఉంటుందని, నిరంతర దగ్గు లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు.నిర్లక్ష్యమే అసలు ప్రమాదంక్యాన్సర్ ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స సంక్లిష్టంగా మారుతుందని డాక్టర్ కిరణ్ వివరించారు. రొమ్ములో నొప్పిలేని గడ్డలు కనిపించడం, రుతుక్రమం ఆగిన తర్వాత రక్తస్రావం జరగడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదన్నారు. మహిళలు వైద్యుల సూచనల మేరకు మామోగ్రఫీ, పాప్ స్మియర్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వయస్సు, కుటుంబ చరిత్ర, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి తగిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం అవసరమన్నారు. స్వయంగా మందులు వాడుతూ కాలయాపన చేయడం వల్ల వ్యాధి నిర్ధారణ ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆరోగ్యంపై అనుమానం కలిగించే మార్పులు కనిపించినప్పుడు నిపుణుల సలహా తీసుకోవాలని సూచించారు.అత్యాధునిక చికిత్సలతో మెరుగైన ఫలితాలుక్యాన్సర్ చికిత్సలో రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఇమ్యునోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, కార్-టి సెల్ థెరపీ వంటి ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో అధునాతన వైద్య సాంకేతికతతో చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వేయించిన ఆహార పదార్థాలను పరిమితంగా తీసుకుంటూ, సమతుల్య ఆహారం, క్రమబద్ధమైన వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంచి, ముందస్తు పరీక్షల ను ప్రోత్సహించడం ద్వారా వ్యాధి భారాన్ని తగ్గించవచ్చన్నారు. సమావేశంలో యశోద ఆసుపత్రి ప్రతినిధి అంకం మల్లేష్ పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో
# పాత్రికేయుల పాత్ర కీలకం

**అయోధ్యలో ఎన్‌యూజే--ఐ జాతీయ మండలి ద్విదిన సమావేశం ముగింపు**

**పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణకు పలు తీర్మానాలు**





అయోధ్య,అక్టోబర్ 09 :
ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి భూపేంద్ర చౌధరి అన్నారు. ప్రజలను చైతన్యవంతం చేయడం తోపాటు ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేయడంలో మీడియా విశేష పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజల్లో నేటికీ అత్యంత విశ్వసనీయమైన వ్యవస్థగా మీడియా నిలుస్తోందని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ అధ్యక్షుడు సురేశ్ శర్మ అన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) జాతీయ మండలి ద్విదిన సమావేశాలు అయోధ్యలోని హనుమాన్ బాగ్ ఆశ్రమంలో ఘనంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది పాత్రికేయ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పాత్రికేయుల హక్కులు, సంక్షేమం, భద్రత, మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. సమావేశాన్ని ప్రారం భించిన మంత్రి భూపేంద్ర చౌధరి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి మీడియా రక్షణ కవచంలాం టిదని, సమాజానికి వాస్తవాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తుందని పేర్కొన్నారు. రాజకీయాల కంటే పాత్రికేయ రంగంపై ప్రజల్లో ఎక్కువ విశ్వాసం ఉందని అభిప్రాయపడ్డారు. డిజిటల్, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముద్రిత మాధ్యమాల బాధ్యత మరింత పెరిగిందన్నారు. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ముద్రిత మాధ్యమ రంగాన్ని ఆదరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించిన మంత్రి, అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, కాశీలో విశ్వనాథ ఆలయ ప్రాంగణ అభివృద్ధి, వింధ్యాచల్ దేవాలయ ప్రాంత అభివృద్ధి వంటి కార్యక్రమాలు ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు ఊతమిచ్చాయని పేర్కొన్నారు. శ్రీరామ మందిర నిర్మాణ ఉద్యమంలో పాత్రికేయులు, మీడియా కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పాత్రికేయుల సంక్షేమానికి సంబంధించి సమావే శంలో ప్రస్తావించిన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న పాత్రికేయుల పింఛను, గౌరవ భృతి పథకాల అంశాన్ని కూడా పరిశీలించాలని కోరుతానని తెలిపారు.

ప్రజల్లో మీడియాపై విశ్వాసం నిలబెట్టాలి

ఎన్‌యూజే--ఐ జాతీయ అధ్యక్షుడు సురేశ్ శర్మ మాట్లాడుతూ, [illegible] 24 రాష్ట్రాల్లో [illegible] సంఘం కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశానికి 22 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని చెప్పారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ముద్రిత మాధ్యమాలు ఇప్పటికీ విశేష సేవలంది స్తున్నాయని పేర్కొన్నారు. వాస్తవాలు, ఆధారాలు, నిజాయితీతో కూడిన కథనాలే మీడియాపై ప్రజల విశ్వాసాన్ని నిలబెడతాయని అన్నారు. పాత్రికేయ విలువలు, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాలను పాత్రికేయ వృత్తితో సమానంగా పరిగణించడం వల్ల మీడియా విశ్వసనీయతపై ప్రభావం పడుతోందని అభిప్రాయపడ్డారు. ఇతర సంస్థలు వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ, ఎన్‌యూజే--ఐ పాత్రికేయుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారిస్తోందని తెలిపారు.

పాత్రికేయుల హక్కుల పరిరక్షణకు తీర్మానాలు

సమావేశంలో పాత్రికేయుల ప్రయోజనాల పరిరక్ష ణకు పలు ముఖ్యమైన తీర్మానాలను ఆమోదిం చారు. వాటిలో ప్రధానంగా

పాత్రికేయుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. పాత్రికేయులకు వేతన బోర్డును ఏర్పాటు చేసి, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను పరిష్కరించాలి. ప్రస్తుత పత్రికా మండలి స్థానంలో విస్తృత అధికారాలతో మీడియా మండలిని ఏర్పాటు చేయాలి. మీడియా రంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. ముద్రిత మాధ్యమాలకు సంబంధించిన ప్రకటనల విధానంలో వివక్షను తొలగించి, సమాన అవకాశాలు కల్పించాలి. పాత్రికేయుల పింఛను, గౌరవ భృతి, సంక్షేమ పథకాలను విస్తరించాలి. ప్రజాస్వామ్యంలో మీడియా తన పాత్రను సమీక్షించుకుంటూ, వృత్తిపరమైన విలువలను కాపాడుకోవాలి. పాత్రికేయులకు అత్యధిక ఉపాధి కల్పిస్తున్న ముద్రిత మాధ్యమాల పట్ల ప్రభుత్వాలు మరింత ఉదారంగా వ్యవహరించాలని ప్రతినిధులు కోరారు. ఉద్యోగులకు వేతన సంఘం ఏర్పాటు చేసినప్పటికీ, పాత్రికేయుల వేతన బోర్డు డిమాండ్ ఇంకా పెండింగ్‌లో ఉండటంపై సమావేశం అసంతృప్తి వ్యక్తం చేసింది.

పాత్రికేయ రంగంలో భవిష్యత్తు తరాలకు మెరుగైన వాతావరణాన్ని కల్పించేందుకు మీడియా తన బాధ్యతలను సమీక్షించుకోవాలని పిలుపు నిచ్చారు. అయోధ్య నగర ఎమ్మెల్యే [illegible] మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో అయోధ్యను ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోందన్నారు. శ్రీరామ మందిర నిర్మాణంతో పాటు నగర అభివృద్ధిలో పాత్రికేయులు, మీడియా ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

అయోధ్య జిల్లా కలెక్టర్ శశాంక్ త్రిపాఠి సమావేశానికి హాజరై జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, శ్రీరామ మందిర దర్శన ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో పాత్రికేయుల పాత్రను ప్రశంసిస్తూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంలో మీడియా సహకారం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. దేశవ్యాప్తంగా అయోధ్యకు సంబంధించిన సానుకూల సమాచా రాన్ని ప్రజలకు అందించాలని కోరారు. సమావేశంలో ఎన్‌యూజే--ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి త్రియుగ్ నారాయణ్ తివారీ కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ బాగ్ ఆశ్రమ మహంత్ జగదీశ్ దాస్ మహారాజ్ సమావేశ నిర్వహణకు అందించిన సహకారాన్ని సంఘం నాయకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ముగింపు సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు అశోక్ మాలిక్ మాట్లాడుతూ, పరస్పర సహకారం, విశ్వాసంతో పాత్రికేయుల హక్కుల సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎన్‌యూజే--ఐ జాతీయ ఉపాధ్యక్షులు ఉమేశ్ చతుర్వేది, కవితా రాజ్, బడే ప్రభాకర్, కార్యదర్శులు అదీప్ సోనీ, భవానీ జోషి, సంఘటనా కార్యదర్శి పురుషోత్తమ్ నాగరోనీ, రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సర్వేశ్ కుమార్ సింగ్ (ఉత్తరప్రదేశ్),ష్ట్ర రవీంద్ర వాజ్‌పేయి (మధ్యప్రదేశ్), రాకేశ్ ప్రవీర్ (బిహార్), కైలాష్ నాయక్ (ఒడిశా), హర్జిందర్ సింగ్ లాల్ (పంజాబ్), దీపక్ వశిష్ఠ్ (చండీగఢ్), బల్దేవ్ శర్మ (ఝార్ఖండ్), టి. అనిల్ కుమార్ (తెలంగాణ), సంభాద్రి కృష్ణ (ఆంధ్రప్రదేశ్), శ్యామ్ మారూ (రాజస్థాన్), బీర్బల్ శర్మ, బల్బీర్ ఠాకూర్ (హిమాచల్‌ప్రదేశ్), బల్జీత్ సింగ్ (హర్యానా), కవీంద్ర సింగ్ (ఢిల్లీ) తదితరులు తమ రాష్ట్రాల్లో పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పాత్రికేయుల ఐక్యతను బలోపేతం చేస్తూ, వారి హక్కులు, భద్రత, సంక్షేమం కోసం సమష్టిగా పోరాడాలని జాతీయ [illegible] పిలుపునిచ్చింది.

## సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఇంట విషాదం..

– నానమ్మ కన్నుమూత



కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు, కన్వీనర్ అభిజీత్ దీప్కే ఇంట విషాదం నెలకొంది. ఆయన నానమ్మ సావిత్రీ బాయి శంకర్ దీప్కే(80) మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. శనివారం తుదిశ్వాస విడిచారు. కాగా.. ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు ముంబై నుంచి వచ్చిన అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను పోలీసులు విమానం దిగిన వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దీప్కే నానమ్మ మృతి.. వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఆమె అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహించనున్నట్లు అభిజీత్ బంధువొకరు తెలిపారు. నానమ్మ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు అభిజీత్ కూడా స్వగ్రామానికి చేరుకోనున్నట్లు సమాచారం.

## సర్‌పై కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టండి..

### నేతలకు రాంచందర్ రావు పిలుపు



హైదరాబాద్, అక్టోబర్ 10: 'సర్' ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని నేతలకు బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈరోజు(శనివారం) నగరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు, ఆల్ సెల్స్ కన్వీనర్లు, అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించిందని వెల్లడించారు.బోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఖండించారు. వరుస ఎన్నికల ఓటములతో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ సంస్థలపై బురదజల్లుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ప్రచారాన్ని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల ప్రజాస్వామ్యానికి చేకూరే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతలకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

### సీఈసీ రాజీనామా డిమాండ్ మరింత ఉధృతం..




వోట్ చోరీకి వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ కూటమి నేతలు ఇప్పటికే ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఆందోళనను మరింత ఉధృతం చేసేందుకు కూటమి సిద్ధమైంది. అక్టోబర్ 12, సోమవారం ఢిల్లీలో భారీ ఎత్తున ఆందోళన చేపట్టాలని ఇండియా కూటమి నిర్ణయించింది. సర్ ప్రక్రియను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. ఇదే సమయంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.ఈ అంశాలపై మరింత ఒత్తిడి పెంచేందుకు సోమవారం భారీ నిరసన కార్యక్రమానికి ఇండియా బ్లాక్ సిద్ధమైంది. ఈ అంశాలపై శుక్రవారం రాత్రి ఇండియా బ్లాక్ నేతలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి మెమొరాండం సమర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడారు. వోట్ చోరీ అంశాన్ని రాష్ట్రపతి ఖండించలేదని రాహుల్ అన్నారు. అలాగే, దీనిపై సోమవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసి మెమొరాండం సమర్పించాలని నిర్ణయించినట్లు రాహుల్ గాంధీ వివరించారు. అలాగే, సీఈసీపై చర్యలు తీసుకోకుండా చట్టం కల్పించిన రక్షణ హక్కును తీసేయాలని కూడా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.అంటే.. సీఈసీగా పని చేసిన వారు వారిపై పదవీకాలంలో మోపిన అభియోగాలపై ఏ చర్యలు తీసుకోవడానికి వీలుండదు. ఈ కేసుల్లో వారిపై జీవితాంతం అరెస్టు కాకుండా చట్టం రక్షణ కల్పిస్తుంది. ఈ చట్టాన్ని ఎత్తివేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. వోట్ చోరీ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నం చేస్తోందని రాహుల్ ఆరోపించారు.

# దూసుకొస్తున్న సౌర తుఫాను..

### రేపు భూమిని తాకే ఛాన్స్.. భారత్‌పై ప్రభావం ఉంటుందా..?

సూర్యుడి నుంచి వెలువడ్డ శక్తిమంతమైన కణాల మేఘాలు భూమివైపు దూసుకొస్తున్నాయి. అక్టోబర్ 11న ఈ సౌర తుఫాను భూమిని తాకే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ సౌరతుఫాను ప్రభావంతో ఉపగ్రహాలు , రేడియో సంకేతాలు, నావిగేషన్ వ్యవస్థల పై కొంత ప్రభావం పడవచ్చని అమెరికా శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అయితే ఈ తుఫాను తీవ్రత ఎంత ఉంటుంది..? భారత్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది..? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..సూర్యుడి నుంచి భారీ మొత్తంలో శక్తి, అతి చిన్న కణాలు అంతరిక్షంలోకి విడుదలవుతాయి. వీటిలో కొన్ని భూమివైపు దూసుకొ స్తాయి. ఈ కణాల మేఘాలు భూమిని చేరినప్పుడు మన గ్రహాన్ని చుట్టుముట్టిన అయస్కాంత క్షేత్రాన్ని ప్రభావితం చేస్తాయి. ఫలితంగా భూమి అయస్కాంత క్షేత్రంలో మార్పులు వస్తాయి. ఈ పరిణామాన్నే 'భూ అయస్కాంత తుఫాను' (జియోమాగ్నెటిక్ స్టార్మ్) అంటారు. సౌర తుఫానులన్నీ ఒకే స్థాయిలో ఉండవు. వీటి తీవ్రతను ఎన్ఓఏఏ ఐదు స్థాయిల్లో వర్గీకరిస్తుంది.స్వల్ప స్థాయి తుఫాను, మధ్యస్థాయి తుఫాను, బలమైన తుఫాను, తీవ్రమైన తుఫాను, అత్యంత తీవ్ర తుఫాను అని ఐదు వర్గాలుగా ఈ సౌర తుఫానులను వర్గీకరించారు. అయితే ప్రతి సౌర తుఫాను భూమిపై భారీ నష్టం కలుగుజేస్తుందని చెప్పలేమని శాస్త్రవేత్తలు అంటున్నారు.

**రేపు ఏం జరుగుతుంది..?**

శాస్త్రవేత్తల వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 7, 8 తేదీల్లో సూర్యుడి నుంచి రెండు భారీ కణ మేఘాలు విడుదలయ్యాయి. ఇవి భూమివైపు ప్రయాణిస్తున్నాయి. రెండో మేఘం వేగంగా కదులుతుండటంతో తొలి మేఘం భూమిని చేరేలోపు రెండో మేఘం దానితో కలిసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ రెండు మేఘాల రాక నేపథ్యంలో అక్టోబర్ 11న మధ్యస్థాయి జీ2 భూ అయస్కాంత తుపాను ఏర్పడవచ్చని అంచనా వేశారు.అయితే అవి భూమి అయస్కాంత క్షేత్రంతో ఎలా ప్రభావితమవుతాయన్న దానిపైనే తుఫాను తీవ్రత ఆధారపడి ఉంటుంది. అందువల్ల ప్రస్తుత అంచనాలను తుది నిర్ణయంగా భావించలేమని శాస్త్రవేత్తలు అంటున్నారు. సౌర తుఫాను ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉన్న ప్రాంతాలు భూమి ధ్రువాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాలే. అక్కడ విద్యుత్ వ్యవస్థల్లో వోల్టేజీ మార్పులు రావొచ్చు. ఉపగ్రహాలను నిర్వహించే సంస్థలు వాటి పనితీరును పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు చేయాల్సి రావచ్చు.కొన్నిచోట్ల రేడియో సంకేతాలు బలహీనపడే అవకాశం ఉంది. ఉపగ్రహ ఆధారిత నావిగేషన్ వ్యవస్థల కచ్చితత్వం కూడా తాత్కాలికంగా ప్రభావిత కావచ్చు. అయితే జీ2 స్థాయి సౌర తుఫాను వస్తుందన్న అంచనా మాత్రమే చూసి



ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ స్తంభిస్తుందని, లేదా విద్యుత్ సరఫరా ఆగిపోతుందని చెప్పలేమన్నారు. సౌర తుఫానుల సమయంలో ఆకాశంలో రంగురంగుల కాంతులు కనిపించే అవకాశం ఉంటుందని, వాటిని 'అరోరాలు' అంటారని చెప్పారు.ఇదిలావుంటే ప్రస్తుత అంచనా ప్రకారం భారత్‌లో సాధారణ ప్రజల రోజువారీ జీవితంపై ప్రభావంపడే సూచనలు లేవు. దేశవ్యాప్తంగా విద్యుత్ కోతలు వస్తాయని, కమ్యూనికేషన్ వ్యవస్థలు నిలిచిపోతాయని చెప్పడానికి ఆధారాలు లేవు. అలాగే మన దేశంలో విస్తృతంగా అరోరాలు కనిపిస్తాయని కూడా అంచనా లేదు. కాబట్టి అక్టోబర్ 11న సౌర తుఫాను వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అది భూమిపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్నది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది.

# రైతుల పట్ల ఇలాగేనా ప్రవర్తించేది..

## గజ్వేల్ ఎమ్మార్వోపై కేటీఆర్ ఆగ్రహం

తమకు బ్రతుకుదెరువును ఇచ్చే వ్యవసాయ భూమి సమస్యను పరిష్కరించాలని తన కార్యాలయానికి వచ్చిన ఓ రైతన్నను గజ్వేల్ ఎమ్మార్వో స్వామి నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావా.. పురుగుల మందు తాగలేదా..? అని నవ్వుతూ మాట్లాడి హేళన చేసిన విషయం తెలిసిందే. సదరు రైతు నా పరిస్థితి చూస్తే మీకు నవ్వు వస్తుందా అని అడిగితే ఆ ఎమ్మార్వో అహంకారంగా అవును వస్తది బరాబర్ వస్తది అని సమాధానం చెబుతున్న వీడియో నెట్టింట రౌండప్ చేస్తోంది.ఈ వీడియోపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఓ బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న ఎమ్మార్వో అన్నదాతను అవహేళన చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనకు అన్నం పెట్టే రైతుల పట్ల ఇలాగేనా ప్రవర్తించేది.. అని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఒక తోటి మనిషి (రైతు) పట్ల ఆ అధికారి ప్రవర్తించిన తీరు చూస్తుంటే.. వారికి మానసిక సమతుల్యత లోపించిందని చెప్పక తప్పడం లేదు. రైతు పట్ల ఎమ్మార్వో వ్యవహరించిన తీరు అత్యంత సిగ్గు చేటు. ఏమాత్రం ఆమోదయోగ్యం కాని విషయమమన్నారు. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని





కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్‌కు, ప్రభుత్వంలో పనిచేస్తున్న రెవెన్యూ యంత్రాంగానికి ఎలాంటి చిన్న చూపు ఉందో మరోసారి ఈ వీడియో చెప్పకనే చెబుతోంది. ఓ రైతు ఒక సమస్య వల్ల తన వ్యవసాయ భూమి, తన బ్రతుకుతెరువును కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆశ్రయిస్తే ఎమ్మార్వో అవహేళనగా నవ్వుతూ మాట్లాడుతూ తహసీల్దార్ స్వామి వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మార్వో వ్యవహారంపై సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

# ఆ గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్‌లో పెడుతున్నాం: మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబరు 10 అమరావతి నిర్మాణ పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయని ఏపీ మంత్రి నారాయణపేర్కొన్నారు. ల్యాండ్ పోలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్‌లో పెడుతున్నామని ప్రకటించారు. రాజధాని నిర్మాణంలో ఉన్న ఐకానిక్ టవర్ల పనులను ఈరోజు (శనివారం) పరిశీలించారు. ఈ పనులపై ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అమరావతి నిర్మాణ పనులపై కాంట్రాక్ట్ సంస్థలకు మంత్రి నారాయణ టార్గెట్ పెట్టారు. ప్రతి నిర్మాణ సంస్థకు పనులు పూర్తి చేయంపై టార్గెట్లు నిర్దేశించామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.వర్షాల కారణంగా గత నెలలో అమరావతి నిర్మాణ పనులకు కొంత అంతరాయం కలిగిందని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని చెప్పుకొచ్చారు. ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తవుతుందని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హై కోర్టు ఫౌండేషన్ పనులు దాదాపు పూర్తి అయ్యాయని తెలిపారు. అధికారులు, ప్రజా పతినిధుల భవనాలు దాదాపు అయిపోయాయని అన్నారు. నవంబర్ 11వ తేదీ తర్వాత నుంచి ప్రారంభోత్సవాలు మొదలు పెడతామని చెప్పారు. 350 కిలోమీటర్ల ట్రంక్ రోడ్లు, 1500 కిలోమీటర్ల లే అవుట్ రోడ్లు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు.

**రాజధానిపై కొంతమంది అవాకులు, చవాకులు పేలుతున్నారు..**

రాజధానిపై కొంతమంది అవాకులు, చవాకులు పేలుతున్నారని మంత్రి నారాయణ ధ్వజమెత్తారు. విమర్శలు చేసే వారు అమరావతికి వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు ఏంటో కనిపిస్తాయని చెప్పారు. ఇక్కడ ప్రస్తుతం 35 వేల మంది కార్మికులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం 2028 అక్టోబరు నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేయడమే లక్ష్యమని ఉద్ఘాటించారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్ సిటీ కోసం మూడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని తెలిపారు.




75శాతానికి పైగా ల్యాండ్ పూలింగ్ వచ్చేనెలాఖరుకు పూర్తవుతుందని వివరించారు. డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌పై సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తుందని వెల్లడించారు. అమరావతి నుంచి గుంటూరుకు నేరుగా వెళ్లేలా సమాంతరంగా ఉండే రోడ్డును డిజైన్ చేస్తున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.




## ఒక్కసారిగా పెరిగిన గోల్డ్, సిల్వర్ ధరలు.. ఎంతో తెలిస్తే

శుక్రవారం బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. డిమాండ్ పెరగడంతో పాటు డాలర్ బలహీనపడటంతో ధరలు అమాంతం పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశంలో శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.1,140 మేర పెరిగి రూ.1,36,200కు చేరింది. 22 క్యారెట్ గోల్డ్ ధర కూడా సుమారు వెయ్యి మేర పెరిగి రూ.1,24,850కు చేరుకుంది. వెండి ధర కూడా జోరందుకుంది. నిన్నటితో పోలిస్తే నేడు కిలో వెండి ధర ఏకంగా రూ.4 వేల మేర పెరిగి రూ.2,42,000కు చేరింది

నగరాల వారీగా చూస్తే చెన్నైలో 24 క్యారెట్ బంగారం స్పాట్ రేటు రేటు అత్యధికంగా రూ.1,37,240గా ఉంది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో రూ.1,36,200గా ఉంది. ఇక చెన్నైలో 22 క్యారెట్ స్పాట్ 10 గ్రాముల గోల్డ్ రేటు 1,25,800గా ఉంటే, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి నగరాల్లో రూ.1,24,850గా ఉంది. చెన్నైలో కిలో వెండి రేటు రూ.2.6 లక్షలకు చేరింది. ముంబై, బెంగళూరులో నగరాల్లో రూ.2.42 లక్షలుగా, హైదరాబాద్‌లో రూ.2.60 లక్షలుగా ఉంది.

ఇక బంగారం ఫ్యూచర్స్ (ఏప్రిల్) ధర రూ.721 మేర పెరిగి రూ.1,40,424కు చేరుకుంది. కిలో వెండి ఫ్యూచర్స్ (మార్చ్) ధరలు కూడా భారీగా పెరిగాయి. ఒకానొక దశలో దాదాపు 7 వేల మేర పెరిగి రూ. 2,43,443ల గరిష‘స్థాయిని తాకింది. ప్రస్తుతం రూ.2,39,041 వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే ఇది దాదాపు రూ. 3 వేలు ఎక్కువ.

# మార్చి వరకూ వర్క్ ఫ్రమ్ హోమ్..

## భారత్‌లోని హెచ్-1బీ ఉద్యోగులకు అమెజాన్ అనుమతి




వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్స్‌లో జాప్యం కారణంగా భారత్‌లో ఉండిపోయిన తమ హెచ్-1బీ ఉద్యోగులు అమెజాన్ గుడ్ న్యూస్ చెప్పింది. మార్చి వరకూ వారికి వర్క్ ఫ్రమ్ హోమ్‌ను అనుమతిస్తున్నట్టు తెలిపింది. ఉద్యోగులు ఆఫీసుకు తప్పనిసరిగా రావాలని మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు స్పష్టం చేసిన తరుణంలో అమెజాన్ ఈ నిర?యం తీసుకోవడం గమనార్హం

జాతీయ మీడియా కథనాల ప్రకారం, అంతర్గత ప్రకటనలో అమెజాన్ ఈ విషయాన్ని వెల్లడించింది. డిసెంబర్ 13 మొదలు భారత్‌లో వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూలింగ్ కోసం వేచి చూస్తున్న హెచ్-1బీ వీసాదారులను వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అనుమతిస్తున్నట్టు తెలిపింది. మార్చి 2 వరకూ వారికి ఈ వెసులుబాటు ఉంటుందని తెలిపింది.

అయితే.. వారి కార్యకలాపాలపై కొన్ని పరిమితులు కూడా విధించింది అమెజాన్. కస్టమర్లతో చర్చలు, కోడింగ్, వ్యూహాత్మక నిర?యాలు ఏవీ తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. కోడింగ్‌కు సంబంధించి సమస్యల పరిష్కారం, టెస్టింగ్ వంటివి చేపట్టేందుకు వారికి అనుమతి లేదు. అంతేకాకుండా, భారత్‌లో ఉన్న సమయంలో వారెవరూ ఇక్కడి అమెజాన్ సంస్థలకు వెళ్లకూడదు. ఇక మార్చి 2 తరువాత వీసా అపాయింట్‌మెంట్స్ ఉన్న వారిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

హెచ్-1బీ వీసా విధానానికి ట్రంప్ ప్రభుత్వం భారీ మార్పులు చేయడంతో అనేక అమెరికా సంస్థలు ఇక్కట్ల పాలవుతున్నాయి. వీసా జారీకి ముందు అభ్యర్థుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వీసా రెన్యూవల్స్‌కు సంబంధించిన అపాయింట్‌మెంట్ డేట్స్ జూన్ వరకూ వాయిదాపడ్డాయి. దీంతో, అమెరికాను వీడొద్దంటూ గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు తమ హెచ్-1బీ వీసా ఉద్యోగులకు సూచించాయి.

## నెయ్యిని రోజూ ఉదయాన్నే పరగడుపునే తింటే కలిగే అదుతేమైన లాభాలు ఇవే..!



ఎ పాలతో తయారు చేసే పదార్థాల్లో నెయ్యి కూడా ఒకటి. నెయ్యి మన ఆహారానికి చక్కటి రుచిని అందిస్తుంది. నెయ్యితో మనం అనేక తీపి వంటకాలను తయారు చేసుకుని తింటూ ఉంటాం. నెయ్యితో చేసే వంటకాలను అందరూ ఇష్టపడతారని చెప్పవచ్చు. నెయ్యిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. ఆయుర్వేదంలో నెయ్యిని అనేక చికిత్సల్లో ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఆహారంతో కలిపి నెయ్యిని తీసుకోవడానికి బదులుగా నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. మన ఉదయాన్ని నెయ్యితో ప్రారంభించడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి వారు వివరిస్తున్నారు.

జీర? వ్యవస్థకు..

నెయ్యిని తీసుకోవడం వల్ల జీర?క్రియ మెరుగుపడుతుంది. జీర?శయాంతర ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రేగు కదలికలు మెరుగుపడతాయి. దీంతో ఆహారం సులభంగా జీర?మవుతుంది. నెయ్యిలో బ్యూట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది దాని యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాల వల్ల పేగు ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నెయ్యిలో శోథ నిరోధక లక్షణాలు కూడా ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల వాపులు, నొప్పులు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నెయ్యిని తీసుకోవడం వల్ల విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలను మన శరీరం ఎక్కువగా గ్రహించుకుంటుంది. దీంతో శరీరంలో ఆయా విటమిన్ల లోపం లేకుండా ఉంటుంది.

మెదడు పనితీరుకు..

నెయ్యిలో ఉండే కొవ్వు ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అభిజ్ఞా పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో, ఏకాగ్రతను పెంచడంలో కూడా నెయ్యి మనకు సహాయపడుతుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా దీనిలో ఉండే కొవ్వులు, విటమిన్లు చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల గుండె, ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది.



## రాత్రి పూట ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను తీసుకోకూడదు.. ఎందుకంటే..?

మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. మన ఆరోగ్యమే కాకుండా మన నిద్ర కూడా మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుందని మీకు తెలుసా. మారిన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది జంక్ ఫుడ్ ను తీసుకుంటూ ఉన్నారు. ఇది మన నిద్రపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. నిద్రలేమి సమస్యలు కూడా తలెత్తుతాయి. అంతేకాకుండా రాత్రి పూట సరిగ్గా నిద్రించకపోవడం వల్ల మరుసటి రోజు చిరుతిళ్లను తినాలనే కోరిక కలుగుతుంది. కనుక మనం నిద్రించే ముందు తీసుకోవాల్సిన ఆహారంపై తగిన శ్రద్ధ చూపించడం చాలా అవసరం. మనం తీసుకునే భోజనమే మన నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తుంది. కనుక రాత్రి భోజన విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. రాత్రి భోజనంలో కొన్ని ఆహారాలను నిషేధించాలి. రాత్రి భోజనంలో తీసుకోకూడని కొన్ని ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

కారంగా ఉండే ఆహారాలు..

కారంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. దీని వల్ల నిద్రపోవడం కష్టమవుతుంది. కనుక వీటికి బదులు నిద్రించే ముందు హెర్బల్ టీ లేదా పెరుగన్నం వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. కాఫీ, టీ లలో కెఫీన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల వీటిలో ఉండే కెఫీన్ శరీరంలో గంటల తరబడి ఉంటుంది. ఇది నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. కనుక కెఫీన్ కు బదులుగా గోరు వెచ్చని పాలు, హెర్బల్ టీ లను తీసుకోవడం ఉత్తమం. మద్యం తీసుకోవడం వల్ల మొదట్లో నిద్రపోయినప్పటికీ ఇది నిద్ర చక్రానికి ఆటంకం కలిగిస్తుంది. ఫలితంగా నిద్రలేమితో పాటు నిద్ర నాణ్యత కూడా లోపిస్తుంది. కనుక నిద్రించే ముందు ఆల్కహాల్ ను తీసుకోకపోవడమే మంచిది. కొవ్వు ఉండే ఆహారాలు సులభంగా జీర?మవ్వవు. దీంతో కడుపులో అసౌకర్యం, నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక నిద్రించే ముందు పండ్లు, కూరగాయలు వంటి ఆహారాలను తీసుకోవాలి.

చక్కెర ఆహారాలు..

చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శక్తి తగ్గిపోతుంది.నిద్రపోవడం కష్టంగా మారుతుంది. కనుక నిద్రించే ముందు చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోకూడదు. నిద్రించే ముందు ఎక్కువగా భోజనం చేయడం వల్ల కడుపులో అసౌకర్యంగా ఉంటుంది. దీని వల్ల నిద్రకు అంతరాయం కలుగుతుంది. కనుక పడుకోవడానికి కొన్ని గంటల ముందుగానే తేలికగా జీర?మయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.

## గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వెల్లుల్లి..



వంటల్లో ఉపయోగించే వివిధ పదార్థాల్లో వెల్లుల్లి ఒకటి. దీనిని ఎంతో కాలంగా మనం వంటల్లో వాడుతున్నాం. వెల్లుల్లిని వంటలల్లో వేయడం వల్ల వంటల రుచి పెరుగుతుంది. అంతేకాకుండా మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే క్రియాశీలక పదార్థం ఉంటుంది. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇటీవలి అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. లిపిడ్ ప్రొఫైల్స్, గ్లైసెమిక్ ఇండెక్స్, రక్తపోటు, ఆక్సీకరణ ఒత్తిడి వంటి వాటిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో వెల్లుల్లి మనకు ఎంతో దోహదపడుతుంది. గుండె ఆరోగ్యానికి వెల్లుల్లి ఏవిధంగా సహాయపడుతుందో వైద్యులు వివరిస్తున్నారు.

రక్తపోటును తగ్గించడం..

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. తద్వారా రక్తపోటు తగ్గుతుంది. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. గుండె మొత్తం పనితీరును మెరుగుపరచడంలో వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో వెల్లుల్లి మనకు ఎంతో ఉపయోగపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ వల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడతాయి. దీంతో తీవ్రమైన గుండె సమస్యల బారిన పడాల్సి వస్తుంది. కనుక వెల్లుల్లిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె పనితీరు మెరుగుపడడంతో పాటు గుండె కండరాలు బలంగా తయారవుతాయి.

రక్తాన్ని పలుచగా చేస్తుంది..

వెల్లుల్లిలో ఉండే సమ్మేళనాలు రక్తాన్ని పలుచగా చేసి రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తాయి. దీంతో గుండె జబ్బుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అయితే రక్తం పలుచగా అవ్వడానికి మందులు వాడే వారు వెల్లుల్లిని వాడే విషయంలో జాగ్రత్త వహించాలి. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల తలెత్తే ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గించడంలో సహాయపడతాయి.

# ఒక్కో సినిమాకు రూ.8 కోట్లు తీసుకుంటున్నానా . ప్రచారాలపై శ్రీనిది శెట్టి క్లారిటీ..!



సినిమా ఇండస్ట్రీలో ఒక భారీ విజయం అందుకున్న తర్వాత హీరోలు, హీరోయిన్ల పారితోషికాలపై రకరకాల వార్తలు ప్రచారంలోకి రావడం సహజం. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటీనటుల రెమ్యునరేషన్లపై అభిమానుల్లో ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. తాజాగా 'కేజీఎఫ్' సినిమాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న కన్నడ నటి శ్రీనిధి శెట్టి పారితోషికంపై ఇలాంటి ప్రచారమే తెరపైకి వచ్చింది. ఆమె ఒక్కో సినిమాకు రూ.7 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు

'కేజీఎఫ్' చిత్రాలతో భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వరుసగా ఎక్కువ సినిమాలు చేసుకుంటూ వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, తాను అలా చేయలేదని శ్రీనిధి శెట్టి అభిప్రాయపడింది. డబ్బు సంపాదించడమే లక్ష్యమైతే ఆ సినిమా విజయాన్ని ఆసరాగా చేసుకుని అనేక ప్రాజెక్టులకు అంగీకరించి ఉండేదాన్నని పేర్కొంది. మంచి కథలు, తన నటనకు అవకాశం ఉన్న పాత్రలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నది తన ఉద్దేశమని ఆమె చెప్పుకొచ్చింది. సరైన కథ దొరికితే పారితోషికం విషయంలోనూ చర్చలకు సిద్ధంగా ఉంటానని, నటిగా ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడమే తనకు ముఖ్యమని స్పష్టం చేసింది. 2016లో 'మిస్ దివా సుప్రానేషనల్' టైటిల్‌ను గెలుచుకుని, అదే ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 'మిస్ సుప్రానేషనల్' కిరీటాన్ని అందుకున్నారు. ఆ తర్వాత దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన 'కేజీఎఫ్: చాప్టర్ 1' సినిమాతో నటిగా పరిచయమయ్యారు. ప్రస్తుతం శ్రీనిధి శెట్టి విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తున్నారు.

# ఇతరుల జీవితాలపై కామెంట్స్ చేయడానికి మీరెవరు.



సినీ తారల వ్యక్తిగత జీవితాలు, దుస్తులు, రూపురేఖలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ముఖ్యంగా హీరోయిన్లు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై పలువురు సినీ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బాలీవుడ్ నటి, 'సీతారామం' ఫేమ్ మృణాల్ ఠాకూర్ కూడా ఇదే అంశంపై ఘాటుగా స్పందించారు. కత్రినా కైఫ్, కృతి సనన్‌లను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న విమర్శలను తప్పుబడుతూ, ఇతరుల వ్యక్తిగత ఎంపికలను గౌరవించాలని హితవు పలికారు. తన తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ ఆన్‌లైన్ ట్రోలింగ్ గురించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉంటుందని, ఇతరుల వ్యక్తిగత నిర్ణయాలను విమర్శించే అధికారం ఎవరికీ లేదని ఆమె అభిప్రాయపడ్డారు. కత్రినా కైఫ్, కృతి సనన్ వంటి నటీమణులు సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. వారి విజయాలను, కష్టాన్ని మరిచిపోయి చిన్న చిన్న విషయాలపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ప్రతి అంశంలోనూ ఇతరులను తప్పుపట్టడం మానుకోవాలని, సోషల్ మీడియాలో కొందరి ప్రవర్తన చూస్తుంటే జనాలకు పిచ్చి పట్టినట్టుగా అనిపిస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇటీవల కత్రినా కైఫ్ ఓ వేడుకలో పాల్గొన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోల్లో ఆమె శారీరక రూపురేఖలపై కొందరు నెటిజన్లు అనుచిత వ్యాఖ్యలు చేశారు.

# నటి కరీనా బ్యాగ్ ఖరీదు రూ.13 లక్షలపైనే.. ఏంటి స్పెషల్..?



బాలీవుడ్ నటి కరీనాకపూంఎప్పుడూ స్టైల్‌గా కనిపించే ప్రయత్నం చేస్తారు. అందుకే ఆమె ఎక్కడ కనిపించినా తన ఫ్యాషన్ స్టైల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. తాజాగా సింగపూర్ (ాఅఅస్త్రుఖజాబతీ) లో జరిగిన ఫార్ములా వన్ గ్రాండ్ ప్రిక్స్‌కు ఆమె హాజరయ్యారు. ఆ సందర్భంలో ఆమె ధరించిన దుస్తుల కంటే గూడా ఆమె వేసుకున్న ఓ హ్యాండ్‌బ్యాగ్ అందరి దృష్టినీ ఆకర్షించింది.
ప్రముఖ లగ్జరీ బ్రాండ్ 'హెర్మెస్' కు చెందిన ఈ బ్యాగ్ ధర అక్షరాలా రూ.13 లక్షలకు పైనేనట. మరి ఈ బ్యాగ్‌లో అంత ప్రత్యేకత ఏముంది..? రీసేల్ మార్కెట్‌లో ఎంత పలుకుతోంది..? అన్న విషయాలను ఇప్పుడు చూద్దాం.. కరీనా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో సింగపూర్ పర్యటనకు సంబంధించిన ఫొటోను పంచుకున్నారు. కారులో కూర్చుని వెనుక సింగపూర్ అందమైన స్కైలైన్ కనిపించేలా ఫొటోకు పోజిచ్చారు. తెల్లటి దుస్తులు, బ్రౌన్ జాకెట్, సిల్క్ స్కార్ఫ్‌తో స్టైలిష్‌గా కనిపించారు.

అయితే ఆమె చేతిలోని హ్యాండ్‌బ్యాగ్ మాత్రం ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించింది. కరీనా చేతిలో ఉన్నది హెర్మెస్ కెల్లీ 25 మోడల్ బ్యాగ్‌గా గుర్తించారు. ఇది టోగో లేదా ఎప్సమ్ లెదర్‌తో తయారవుతుంది. గోల్డ్ ఫినిషింగ్ హార్డ్‌వేర్ దీని ప్రత్యేకత. బ్యాగ్‌కు ఆండ్రాయిడ్ ఆకారపు చార్మ్‌ను కూడా జతచేశారు. చిన్న సైజులో ఉన్నప్పటికీ లగ్జరీ ఫ్యాషన్ ప్రపంచంలో ఈ మోడల్‌కు మంచి గుర్తింపు ఉన్నది. సోథెబీస్ వెబ్‌సైట్ వివరాల ప్రకారం.. 2026లో అమెరికాలో హెర్మెస్ కెల్లీ బ్యాగ్‌ల ధరలు 3.8 శాతం నుంచి 8.9 శాతం వరకు పెరిగాయి.

ఈ మోడల్ ప్రారంభ ధర 13,700 డాలర్లు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.13.25 లక్షలు. అంటే ఓ ఖరీదైన కారు ధరకు దగ్గరగా ఈ బ్యాగ్ విలువ ఉంటుందన్నమాట. మాడిసన్ అవెన్యూ కౌచర్ వెబ్‌సైట్‌లో హెర్మెస్ కెల్లీ సెల్లియర్ 25 బ్యాగ్ ఒకటి 36,500 డాలర్లకు లిస్ట్ అయింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.35.32 లక్షలు. ఇక కరీనా తన లుక్‌ను తెల్లటి ప్యాంటు, బాడీసూట్, బ్రౌన్ జాకెట్‌తో పూర్తి చేశారు.

# గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి నాని..

## సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' షూటింగ్ షురూ!




నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో దూసుకుపోతూనే మరోవైపు తన ప్రయోగాత్మక చిత్రాలతో టాలీవుడ్‌లో కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఇటీవలే ఆయన నటించిన 'ది ప్యారడైజ్' సినిమా నాని కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ భారీ విజయం అందించిన జోరును ఏమాత్రం తగ్గించకుండా, నాని తన తదుపరి ప్రాజెక్ట్ కోసం వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో నాని ఒక క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సిద్ధమయ్యారు. "బ్లడీ రోమియో" అనే ఆసక్తికరమైన టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రంలో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ మరియు గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించబోతున్నట్లు సమాచారం. కేవలం యాక్షన్ హీరోగానే కాకుండా, ఒక వైవిధ్యమైన చెఫ్ పాత్రలోనూ, అలాగే మరోవైపు పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్‌గానూ ఆయన ద్విపాత్రాభినయం లేదా విభిన్న షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో అదరగొట్టనున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ఈ సినిమా కోసం మేకర్స్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, అక్టోబర్ 16 లేదా 17 నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ సెట్స్‌లోకి అడుగుపెట్టనుంది. తొలి షెడ్యూల్‌లోనే కొన్ని కీలకమైన యాక్షన్ సన్నివేశాలను ఓ చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోందిఈ భారీ ప్రాజెక్ట్‌ను నిహారిక ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సుజీత్ టేకింగ్, నాని బాడీ లాంగ్వేజ్ ఈ సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తాయని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి చేసి, వచ్చే ఏడాదిలోనే (2027) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'ది ప్యారడైజ్' సక్సెస్ ఇచ్చిన జోరుతో నాని ఇప్పుడు పూర్తిగా గ్యాంగ్‌స్టర్ మోడ్‌లోకి మారిపోయి బాక్సాఫీస్ వద్ద మరో సంచలనానికి తెరతీస్తున్నారు.

# రూ.2 కోట్ల బడ్జెట్‌తో సినిమా,బాక్సాఫీస్ వద్ద రూ.50 కోట్ల వసూళ్లు.. 'ప్రేమద ఊరాలి' సంచలనం







సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే మాటను మరోసారి నిజం చేస్తోంది కన్నడ చిత్రం 'ప్రేమద ఊరాలి'. విడుదలకు ముందు పెద్దగా అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. భారీ ప్రచారం, స్టార్ హీరోలు, భారీ బడ్జెట్ లేకుండానే కేవలం కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ వసూళ్లలో దూసుకుపోతోంది. కేవలం రూ.2 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం త్వరలోనే కర్ణాటకలో రూ.50 కోట్ల వసూళ్ల మార్కును అందుకోనుందని ట్రేడ్ వర్గాల అంచనా.ప్రేమద ఊరాలి' సినిమా విడుదలైన తొలిరోజుల్లో బాక్సాఫీస్ వద్ద పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ప్రేక్షకుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు లేకపోవడంతో మొదట్లో వసూళ్లు కూడా నెమ్మదిగానే సాగాయి. అయితే సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మౌత్ టాక్ బలపడటంతో రోజురోజుకూ థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు అండగా నిలుస్తుండటం విశేషం. కథలోని భావోద్వేగాలు, కుటుంబ సంబంధాల చుట్టూ సాగే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. దీంతో తొలి రోజుల్లో నెమ్మదిగా సాగిన వసూళ్లు క్రమంగా పుంజుకుని ఇప్పుడు భారీ స్థాయికి చేరుకుంటున్నాయి.'ప్రేమద ఊరాలి' ఒక సాధారణమైన కథను గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం. కుటుంబ సంబంధాలు, మనుషుల మధ్య అనుబంధాలు, భావోద్వేగాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చారు. భారీ యాక్షన్ సన్నివేశాలు లేదా అద్భుతమైన విజువల్ హంగుల కంటే కథలోని సహజత్వం, పాత్రల మధ్య భావోద్వేగాలే సినిమాకు ప్రధాన బలంగా నిలిచినట్లు తెలుస్తోంది. ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి భారీ బడ్జెట్ తప్పనిసరి కాదని, మంచి కథతోనూ విజయాన్ని అందుకోవచ్చని ఈ సినిమా నిరూపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీ హైకోర్టులో విజయ్ దేవరకొండకు ఊరట



నటుడు విజయ్ దేవరకొండకు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, గొంతు మరియు ఇతర వ్యక్తిగత హక్కులను (ావతీంశీఖ్రీశ్‌ఎ =ఱస్త్రష్ట్రం) అనధికారికంగా ఇతరులు వాడకుండా ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×), డీప్‌ఫేక్స్ మరియు ఫేస్-మార్ఫింగ్ టెక్నాలజీలను ఉపయోగించి ఆయనను అశ్లీల లేదా అసభ్యకర రీతిలో చిత్రీకరిస్తున్న కంటెంట్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది.న్యాయమూర్తి జస్టిస్ వికాస్ మహాజన్ ఈ ఆదేశాలు జారీ చేస్తూ.. మెటా (వీమ్ఖ), గూగుల్ (+శీశీస్త్రశ్రీవ), ఎక్స్ (ఙ) వంటి సోషల్ మీడియా సంస్థలు నటుడు గుర్తించిన అక్రమ కంటెంట్, వీడియోలు, రీల్స్, పోస్టులు మరియు అకౌంట్‌లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే, ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు సంబంధిత లింక్‌లను 72 గంటల్లోగా టేకడౌన్ చేయాలని స్పష్టం చేశారు.